**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 280 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 2 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




# ఖమేనీ ఖతం

## ఇజ్రాయెల్-యూఎస్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ హతం

**ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**

- నలుగురు కుటుంబ సభ్యులు కూడా..
- పక్కా సమాచారంతో 15 నిమిషాల్లో మిస్సైళ్లతో అటాక్
- ధ్రువీకరించిన ఇరాన్ అధికారిక మీడియా
- 40 రోజులు సంతాప దినాలు పాటించాలని నిర్ణయం
- కచ్చితంగా బదులు తీర్చుకుంటామని వార్నింగ్

ఇరాన్ కు గట్టి దెబ్బ తగిలింది. ఇజ్రాయె ల్, అమెరికా దాడుల్లో ఆదేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ (86) హతమయ్యారు. ఈ విషయాన్ని ఇరాన్ అధికారిక మీడియా ధ్రువీకరించింది. 'ఆపరేషన్ పికప్యూరీ' పేరుతో ఖమేనీ ఆఫీస్ టార్గెట్ గా జరిగిన భారీ దాడుల్లో ఆయన మృతిచెందారని పేర్కొంది. ఖమేనీ డెడ్బాడీని ఇరాన్అధికారు లు శిథిలాల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా 7 రోజులు పబ్లిక్ హాలిడేస్, 40 రోజుల పాటుదసంతాప దినాలు పాటించాలని నిర్ణయిం చినట్లు తెలిపింది. ఖమేనీ చనిపోయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనౌన్స్ చేసిన కాసేపటికే ఇరాన్ ఈమేరకు ప్రకటన విడుదల చేసింది.

### ఖమేనీ చనిపోయారు: ట్రంప్

ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ చనిపోయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఖమేనీని చరిత్రలో నే అత్యంత చెడ్డ వ్యక్తిగా పేర్కొన్నారు. ఈ చావుతో ఇరాన్ పౌరులతో పాటు అమెరికన్లు, బాధిత దేశాలకు న్యాయం జరిగిందన్నారు. తమ నిఘా నుంచి ఖమేనీ తప్పించుకోలే కపోయారని అన్నారు. ఇరాన్ ను తిరిగి స్వాధీనం చేసుకోవ డానికి అక్కడి పౌరులకు ఇది అతిపెద్ద అవకాశమమన్నారు. దాడులు మరో వారం కొనసాగుతాయని స్పష్టంచేశారు

- మిగతా 2లో

## అమరావతిలో జ్యుడీషియల్ అకాడమీకి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన

- అమరావతిలో పలు నిర్మాణాలకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శ్రీకారం
- జ్యుడిషియల్ అకాడమీ, హైకోర్టు అతిథిగృహానికి శంకుస్థాపన
- హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయానికి ప్రారంభోత్సవం
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు సీజే, న్యాయమూర్తులు






**అమరావతి, పెన్ సత్తా, మార్చి 01:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ఆదివారం రాజధాని అమరావతి సమీపం లోని పిచ్చుకల పాలెం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, సీఎం చంద్రబాబు నాయుడు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ జోయ మాల్యా బాగ్చి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తోపాటు పలువురు న్యాయ మూర్తులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.రూ. 165 కోట్ల వ్యయంతో ఈ జ్యుడీషియల్ అకాడమీని నిర్మిస్తున్నారు. దీనిలో బ్లాక్ బిలో జి ప్లస్ 3 అంతస్తులతో అకాడమిక్ బ్లాక్ నిర్మాణం చేపట్టనున్నారు. అదే విధంగా జి ప్లస్ 8 అంతస్తులతో హాస్టల్ బ్లాక్, జి ప్లస్ 3 అంతస్తుల్లో ఇండోర్ స్పోర్ట్స్, గెస్ట్ ఫెసిలిటీస్ ఏర్పాటు చేస్తున్నారు. 120 మంది బ్యాచ్ ఆఫ్ ట్రైనీ జడ్జిల సామర్థ్యంతో ఈ జ్యుడీషియల్ అకాడమీ నిర్మిస్తున్నారు. మొత్తం భవన విస్తీర్ణం 2.05 లక్షల చదరపు

- మిగతా 2లో

## మీ యుద్ధం పొరుగువారితో కాదు, తెలివి తెచ్చుకోండి..

### ఇరాన్‌కు యూఏఈ హెచ్చరిక



అబుదాబీ: అమెరికా మద్దతుతో ఇరాన్ పై ఇజ్రాయెల్ శనివారం నాడు దాడి జరపడం, ఇందుకు ప్రతిగా ఇరాన్ వరుసగా రెండో రోజు కూడా ఇజ్రాయెల్ సహా అమెరికా మిత్రదేశాల పై దాడులు జరుపుతుండటం పై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆగ్రహం వ్యక్తం చేసింది. పొరుగుదేశాల పై దాడులు ఎందుకు చేస్తున్నారని ఇరాన్ ను నిలదీసింది. మీ యుద్ధం పొరుగుదేశాలతో కాదంటూ హెచ్చరికలు చేసింది. తొలుత ఇజ్రాయెల్ జరిపిన దాడులతో ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా మిత్రదేశాల పై దాడులు చేసింది. ఆయా దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఈ దాడులు చేపట్టింది. యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రెయిన్, ఒమన్, సౌదీ ఆరేబియాల పై దాడులు జరిపింది. దీని పై యూఏఈ తొలిసారి ఘాటుగా స్పందించింది. గల్ఫ్ దేశాల పై ఇరాన్

- మిగతా 2లో

## ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్ అయతొల్లా అలిరెజా అరాఫీ

- అమెరికా ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఖమేనీ మృతి
- ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అలిరెజా అరాఫీ నియామకం
- పరిపాలన కోసం ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు
- గార్డియన్ కౌన్సిల్ సభ్యుడిగా అరాఫీకి ఉన్నత అనుభవం

ఇరాన్: ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. ఒకదాని పై మరొకటి క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసుకున్నాయి. అయితే ఇరాన్ పై జరిపిన దాడుల్లో సుప్రీ లీడర్ ఖమేనీ మృతి చెందినట్లు ఇరాన్ మీడియా ధృవీకరించింది. అంతేకాక ఈ దాడుల్లో ఖమేనీ కుమార్తె, మనవడు, కోడలు, అల్లుడు మరణించినట్లు వెల్లడించింది. ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన కేవలం 30 సెకన్ల లోనే ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా

- మిగతా 2లో



## అమ్మభాష అమృతం.. అందులోనే మాధుర్యం



- పద్యాలు పాడుతూ.. తెలుగు ఔన్నత్యాన్ని వివరించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- తెలుగులో ప్రసంగం ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- తెలుగు పరిరక్షణ ప్రతి తెలుగింటి బాధ్యత.. మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్
- అమలాపురంలో వైభవంగా ప్రపంచ తెలుగు మహాసభలు

ఓ వ్యక్తి తన భావాన్ని మాతృభాషలో వ్యక్తం చేసినట్లు మరే భాష లోనూ చేయలేరు.. అలాంటి భాషను జాతీయ సంపదగా భావితరా లకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.. అని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. కొన్ని పద్యాలను

- మిగతా 2లో



## అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి

- రాజధాని నగరాన్ని జ్యుడిషియల్ హబ్‌గా మారుస్తాం
- అందుకు సహకరించాలని సీజేఐకి సీఎం చంద్రబాబు వినతి
- మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరిస్తే రూ.10వేలు ఇస్తామని వెల్లడి

- మిగతా 2లో

## గల్ఫ్ దేశాల్లో ఉన్న రాష్ట్ర ప్రజలు ఆందోళన పడొద్దు



అమరావతి, మార్చి 01: ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్ర ఎన్.ఆర్.ఐ. సాధికారిత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి కొండపల్లి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆయా దేశాల్లో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు, పర్యాటకులు సహా ఇతర రాష్ట్ర పౌరులు ఎవరూ

- మిగతా 2లో

# ఖమేనీ ఖతం

**15 నిమిషాల్లో అటాక్**

ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో సుప్రీం లీడర్ ఖమేనీ కుటుంబంలోని నలుగురు చనిపోయినట్లు ఇరాన్ మీడియా వెల్ల డించింది. ఆయన కూతురు, అల్లుడు, కోడలు, మనవరాలు చనిపోయినట్లు పేర్కొంది. ఈ జాయింట్ ఆపరేషన్లో ఖమేనీ ఇంటిపై 30 బాంబులు వదిలిన ట్లు తెలిపింది. ఇందుకోసం ఇజ్రాయెల్ కొన్నినెలలుగా ప్లాన్ చేస్తోందని, అగ్రనా యకులు అందరూ ఒకే దగ్గర ఉండగా అటాక్ చేసిందని వెల్లడించింది. అం తకుముందు నిఘా సంస్థల సమాచా రంతో పాటు టెహ్రాన్లోని ఆఫీసులో ఖమేనీ ఉన్నట్లు యూఎస్, ఇజ్రాయెల్ నిర్ధారణకు వచ్చాయి. శాటిలైట్ ద్వారా లొకేషన్ ట్రేస్చేసి 15 నిమిషాల్లోనే మి సైళ్లతో విరుచుకుపడినట్లు తెలుస్తోంది. ఈ అటాక్ కోసం అమెరికా, ఇజ్రాయెల్ రెండు వారాల ముందే డేట్ ఫిక్స్ చేసిన ట్లు తెలుస్తోంది.

**36 ఏండ్లు ఇరాన్ ను శాసించిన సుప్రీం లీడర్**

ఇరాన్ ను 36 ఏండ్ల తన ఉక్కుపిడికిలితో పాలించిన నియంత అలీ ఖమేనీ. 1939లో ఇరాన్లోని మార్షద్లో ఓ పేద కుటుంబంలో ఖమేనీ జన్మించారు. ఇస్లామిక్ తిరుగుబాటు నాయకుడు ఖొమైనీకి శిష్యుడిగా మారి ఇరాన్ షా ప్రభుత్వాన్ని పడగొట్టడంలో ఖమేనీ ముఖ్యపాత్ర పోషించారు. తన గురువు ఖొమైనీ నాయకత్వంలో 1979లో ఇరాన్లో ఇస్లామిక్ రూల్ స్థాపించగలిగా రు. 198088 మధ్య ఇరాక్తో ఎనిమిదేళ్ల యుద్ధం సాగినా ఇరాన్ పట్టును సడలనివ్వలేదు. 1989లో ఇరాన్ తొలి సుప్రీంలీడర్ ఆయతొల్లా రుహుల్లా ఖొమైనీ చనిపోయాక ఖమేనీ పగ్గాలు అందుకున్నారు. సుప్రీంలీడర్ హోదా కోసం రాజ్యాంగాన్ని మార్పించారు. యూఎస్ సహా విదేశాల ఆంక్షలు, ఒత్తి ళ్లు కొనసాగినా పట్టువీడలేదు. నిరసనలు చెలరేగితే నిర్దాక్షిణ్యంగా వాటిని అణచివేసేవారు. హెజ్బొల్లా, హౌతీ వంటి మిలిటెంట్ సంస్థలను పోషించి పశ్చిమాసియాను శాసించారు.

**అగ్రనాయకత్వాన్ని హతం చేశాం: ఇజ్రాయెల్**

అమెరికాతో కలిసి జరిపిన దాడుల్లో ఇరాన్ అగ్రనాయకులు హతమైనట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. సుప్రీం లీడర్ ఖమేనీ చని పోయినట్లు ట్రంప్, నెతన్యాహు వెల్లడిం చారు. రక్షణ మంత్రి అజీజ్, సుప్రీం లీడర్ మిలిటరీ బ్యూరో చీఫ్ షిరాజీ, డిఫెన్స్ కౌన్సిల్ సెక్యూరిటీ అడ్వైజర్ అలీ షంఖానీ, ఐఆర్జీసీ చీఫ్ మహమ్మద్ పక్ పౌర్, ఎస్పీ ఎన్టీ ఛైర్మన్ హోస్సేన్ జబల్, ఎస్పీఎన్డీ మాజీ ఛైర్మన్ మొజాఫరీ, అలన్బే కమాండ్ ఇంటెలిజెన్స్ చీఫ్ సలేహ్ అసాదీ హతమ య్యారు.

## అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి లో నేషనల్ జ్యుడిషి యల్ అకాడమీ ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు విన్నవించారు. అవకాశమిస్తే నిర్మాణాల బాధ్యత తీసుకొని, అన్నివిధాలా సహకరిస్తామన్నారు. రాజధానిలో నిర్మించే 'జస్టిస్ సిటీ'ని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలనుకుంటున్నామని.. అందుకు అవసరమైన సూచనలు, సలహాలిచ్చి మార్గదర్శకత్వం చేయాలని సీజేఐని కోరారు. జ్యుడిషియల్ అకాడమీ, మధ్యవర్తిత్వ కేంద్రం, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భవనం లాంటివన్నీ ఈ 'జస్టిస్ సిటీ'లో ఉంటాయని చెప్పారు. న్యాయవ్యవస్థ, పరిపాలనకు సంబంధించిన ప్రతి విభాగం ఇక్కడ ఉండేలా చూస్తామన్నారు. అమరావతిని జ్యుడిషియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. విజయవాడలో ఆదివారం 'మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి చర్చ' నిర్వహించారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. సీజేఐ సూచనల మేరకు ఏపీ జ్యుడిషియల్ అకాడమీ కోసం మరికొంత భూమి కేటాయిస్తామని సీఎం తెలిపారు. సీజేఐ సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రోజంతా అమరావతిలో, తిరుపతిలో గడపటం ఆనందంగా ఉందని, రాష్ట్ర చరిత్రలో ఇదో చారిత్రక సందర్భమన్నారు. సీఎం ప్రసంగంలోని ప్రధానాంశాలు...

**మధ్యవర్తిత్వంతో ఏదైనా సాధించొచ్చు..**

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారమైతే ఒక్కో కేసుకు మధ్యవర్తులకు ప్రస్తుతం రూ.3 వేలు చెల్లిస్తున్నాం. దీన్ని రూ.10 వేలకు పెంచుతున్నాం. కేసులు పరిష్కారం కాకపోయినా సరే మధ్యవర్తిత్వం వహించినందుకు రూ.3 వేలు చెల్లిస్తాం.

సంప్రదింపుల ద్వారా చేపట్టిన అత్యుత్తమ ప్రాజెక్టు రాజధాని అమరావతి. ప్రపంచంలో ఇలాంటిది ఇంకెక్కడా లేదు. సంప్రదింపులతో 29వేల మంది రైతుల నుంచి 33వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా సమీకరించి రాజధానిని నిర్మిస్తున్నాం. ఇది ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్.

ప్రతి ఒక్కరూ అమరావతిలో ఓ ఇంటి స్థలం ఉంచుకోండి. ఇక్కడ అత్యుత్తమ జీవన ప్రమాణాలుంటాయి. కాలుష్యరహిత నగరంగా అమరావతి ఉంటుంది.

**జస్టిస్, అభివృద్ధి కలిసి పనిచేయాలి...**

న్యాయం అందటంలో జాప్యం జరిగితే.. అభివృద్ధి పురోగతి లోనూ జాప్యం చోటుచేసుకుంటుంది. జస్టిస్, అభివృద్ధి కలిసి పనిచేయాలి. విధాననిర్ణేతలుగా మేము వేగవంతమైన అభివృద్ధి కోరుకుంటాం. దానికి జ్యుడిషియరీ సహకరిస్తే దేశం అగ్రగామిగా మారుతుంది.

నా చిన్నతనంలో మా నాన్న మధ్యవర్తిత్వం ద్వారా అనేక వివాదాలు పరిష్కరించారు. ఆయన చదువుకోలేదు. అయినా చుట్టుపక్కలుండే 20–30 గ్రామాల ప్రజలకు ఆయనపై విశ్వాసం ఉండేది.

## అమరావతిలో జ్యుడీషియల్ అకాడమీకి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన



-మొదటిపేజీ తరువాయి

అడుగులలో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఏపీ హైకోర్టు నుంచి ఈ జ్యుడీషియల్ అకాడమి 5.7 కి.మీల దూరంలో 50 మీటర్ల వెడల్పు కలిగిన రహదారిని ఏర్పాటు చేయనున్నారు.

బ్లాక్ ఏ జీ ప్లస్ 3 అంతస్తులతో కూడిన అడ్మినిస్ట్రేటివ్, అకాడమిక్ బ్లాక్ నిర్మిస్తున్నారు. 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియంతో కూడిన స్టేజ్‌తోపాటు ప్రీ ఫంక్షన్ ఏరియాను ఏర్పాటు చేస్తున్నారు. 120 సీట్లతో కూడిన సెమినార్ హాల్, 70 సీట్లతో రెండు క్లాస్ రూమ్‌లు, 70 సీట్లతో మూట్ కోర్టు హాల్, 60 సీట్లతో ఫోరెన్సిక్ ల్యాబ్‌లు నిర్మిస్తున్నారు. అంతేకాకుండా.. 50 సీట్లతో కంప్యూటర్ ల్యాబ్, 48 సీట్లతో లైబ్రరీ, రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు. బ్లాక్ – బి జి ప్లస్ 3 అంతస్తులతో కూడిన ఈ భవనంలో రెసిడెన్షియల్ సౌకర్యాలు కల్పించనున్నారు. 108 సీట్లతో డైనింగ్ హాల్,10 సీట్ల వీఐపీ డైనింగ్ హాల్, పూర్తి స్థాయి సౌకర్యాలతో కూడిన కిచెన్, సర్వీస్ ఏరియా జిమ్, 2 బ్యాడ్మింటన్ కోర్టు హాళ్లు, స్క్వాష్ కోర్టు, టేబుల్ టెన్నిస్ హాల్, యోగా, మెడిటేషన్‌కు ప్రత్యేకంగా మల్టీ పర్పస్ హాల్ సౌకర్యాలు కల్పించనున్నారు.

బ్లాక్ బి 2 జీ ప్లస్ 8 అంతస్తులతో కూడిన భవనంలో జ్యుడీషియల్ అధికారులు, ట్రైనీలకు రెసిడెన్షియల్ అకామిడేషన్, 98 సీట్లతో టిపికల్ హాస్టళ్ల యూనిట్, 5 సూట్ రూమ్‌లు, ప్రతి అంతస్తులో లాంజ్ స్పేస్, ప్యాంట్రీ, యుటిలిటీ సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. బ్లాక్ బి 3 జి ప్లస్ 1 అంతస్తులతో కూడిన భవనంలో స్విమ్మింగ్ పూల్, పార్కింగ్, సపోర్టింగ్ స్టాఫ్ వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. పార్కింగ్ ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన బేస్మెంట్ పార్కింగ్, రెండు జోన్లలో ద్విచక్ర వాహనాల పార్కింగ్, సైక్లింగ్, వాకింగ్ ట్రాకులు ఏర్పాటు చేయనున్నారు. డ్రైవర్స్ డార్మిటరి, రెండు సర్వీస్ క్వార్టర్స్ నిర్మించనున్నారు.

## ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్ అయతొల్లా అలిరెజా అరాఫీ

-మొదటిపేజీ తరువాయి

అలీ ఖమేనీతో పాటు పలువురు సీనియర్ అధికారులు హతం అయినట్టు సమాచారం. అయితే ఖమేనీ మరణంతో ఇరాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన వారసుడిగా అయతొల్లా అలిరెజా అరాఫీని ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా నియమించింది. ఇజ్రాయెల్ – అమెరికా సంయుక్తంగా జరిపిన భారీ వైమానిక దాడుల్లో ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. ఆయన మరణాన్ని అటు ఇరాన్ మీడియాతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా ప్రకటించారు. అయితే ఖమేనీ మృతి నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త సుప్రీం నాయకుడిగా సీనియర్ మతాధికారి ఆయతొల్లా అలిరేజా అరాఫీని నియమించినట్లు ఇరాన్ పేర్కొంది. ఆయన తాత్కాలిక సుప్రీం లీడర్ గా పనిచేస్తారని తెలిపింది. ఇక ఇస్లామిక్ విప్లవ నేత ఖొమేనీ మరణం అనంతరం.. 1989 నుంచి ఖమేనీ ఇరాన్ సుప్రీం నాయకుడిగా కొనసాగుతూ వచ్చిన విషయం తెలిసిందే. ఇక ఇరాన్ రాజ్యాంగం లోని ఆర్టికల్ 111 ప్రకారం సుప్రీం లీడర్ మరణించినప్పుడు లేదా తన విధులను నిర్వహించలేని సమయంలో ఒక ఇంటీరియం లీడర్షిప్ కౌన్సిల్ ను ఏర్పాటు చేస్తారు. ఈ మండలిలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఇందులో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, జ్యుడీషియరీ చీఫ్ గులాంహొస్సేన్ మొహసెని ఎజెయి, గార్డియన్ కౌన్సిల్ జ్యూరిస్ట్ ఉంటారు. ఇక ఇరాన్ రాజ్యాంగం ప్రకారం 88 మంది సభ్యులున్న అసెంబ్లీ ఆఫ్ ఎక్స్ పర్ట్స్ తదుపరి పూర్తి స్థాయి సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే వరకు ఈ కౌన్సిల్ బాధ్యతలు నిర్వహిస్తుంది. రష్యన్ మీడియా కథనం ప్రకారం అయతొల్లా అరాఫీ ఇరాన్ లోని అత్యంత శక్తివంతమైన మతపర మైన నాయకుల్లో ఒకరు. 1959 లో ఇరాన్ లోని మేబోద్ లో జన్మించిన ఆయన షియా మతగురువుగా ఇస్లామిక్ న్యాయనిపుణుడిగా పేరు పొందారు. దేశ చట్టాలను, ఎన్నికలను పర్యవేక్షించే శక్తివంతమైన గార్డియన్ కౌన్సిల్‌లో కూడా ఆయన సభ్యుడిగా ఉన్నారు. అలాగే గతంలో ఖమేనీకి అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు అయతొల్లా అరాఫీ.

## మీ యుద్ధం పొరుగువారితో కాదు, తెలివి తెచ్చుకోండి..

-మొదటిపేజీ తరువాయి

దురాక్రమణ ఒక తప్పుడు లెక్క, ఈ చర్య ఇరాన్‌ను ఒంటరిని చేస్తుంది. యూఏఈ వంటి పొరుగుదేశాలు యుద్ధంలో లేవు, తెలివిగా వ్యవహరించాలి అని యూఏఈ అధ్యక్షుడి దౌత్య సలహాదారు అన్వర్ గార్గాష్ అన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ శనివారం ఉదయం టెహ్రాన్ పై భారీ సైనిక చర్య చేపట్టాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ, పలువురు ఉన్నత సైనిధికారులు మృతిచెందారు. దాడులు మొదలైన కొద్దిసేపటికే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. దీంతో ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. బహ్రెయిన్, కువైట్, ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్‌లతో విరుచుకుపడింది. దుబాయ్‌లో రెండోరోజైన ఆదివారంనాడు కూడా పేలుళ్లు వినిపించాయి. దుబాయ్ విమానాశ్రయం సమీపంలో దాడి జరగడంతో విమాన సర్వీసులను నిలిపివేశారు. దుబాయ్‌లో ల్యాండ్ ఐలాండ్ పామ్, లగ్జరీ హోటల్ బుర్జ్ అల్ అరబ్ వద్ద పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఇరాన్ వాయిసేన పెర్షియన్ గల్ఫ్‌దేశాలు, ఇరాక్ కుర్దిస్తాన్‌లోని అమెరికా స్థావరాల పై బాంబు దాడులు జరిపింది.

## అమ్మభాష అమృతం.. అందులోనే మాధుర్యం

-మొదటిపేజీ తరువాయి

వల్లెవేస్తూ భాషపై తనకున్న మమకారాన్ని చాటుకున్నారు. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలు రెండోరోజైన ఆదివారం వేడుకగా జరిగాయి. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, కోనసీమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) అధ్యక్షతన జరుగుతున్న ఈ సభలకు అబ్దుల్ నజీర్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మొహియుద్దీన్, జస్టిస్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ రామకృష్ణారెడ్డి, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజాకిరణ్, తెలంగాణ హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ, ఏపీ హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ ధనుంజయ్, ఎంపీ అప్పలనాయుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ పాల్గొన్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తన ప్రసంగాన్ని 'తెలుగు మహాసభలకు దేశ, విదేశాల నుంచి వచ్చిన భాషాభిమానులకు, సాహితీవేత్తలకు తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు' అంటూ తెలుగులో ప్రారంభించి, చివర్లో 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ..' గీత ఆలాపనతో ముగించారు. 'మహత్తర భాష తెలుగును పరిరక్షించడం ప్రతి తెలుగింటి బాధ్యత' అని మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్ అన్నారు.

**సంస్కృతీ సంప్రదాయాల సమ్మేళనం తెలుగు భాష**
**– అబ్దుల్ నజీర్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్**

తెలుగు అనేది భాష మాత్రమే కాదు. సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాల సమ్మేళనం. గిడుగు రామ్మూర్తి పంతులు చెప్పినట్లు అమ్మచేతి గోరుముద్ద తెలుగు.. రుచి రాగాల పాలముద్ద తెలుగు. అమ్మరూపం భాష, అమృత జలపాతం నా తెలుగు భాష.. తెలుగు అనేది కేవలం ఇద్దరి మధ్య సంభాషణ మాత్రమే కాదు. ఇది ఒక చారిత్రాత్మక గుర్తింపు. ఓ వ్యక్తి తన భావాన్ని మాతృభాషలో వ్యక్తం చేసినట్లు మరే భాషలోనూ చేయలేరు. అలాంటి భాషను జాతీయ సంపదగా భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. మాతృభాషను రక్షిస్తే సంస్కృతీ సంప్రదాయాలు సురక్షితంగా ఉంటాయి.

**సామాజిక, సాంస్కృతిక వైభవానికి వారధి తెలుగు**
**– జిష్ణుదేవ్ వర్మ, తెలంగాణ గవర్నర్**

నేను తెలుగు మాట్లాడలేకపోయినా, అర్థం చేసుకోగలను. తెలుగు ఒక భాష మాత్రమే కాదు.. సాంస్కృతిక, సామాజిక వైభవానికి వారధి. పరిపాలన సౌలభ్యం కోసం రెండు తెలుగు రాష్ట్రాలూ దీన్ని కొనసాగించాలి. కవిత్రయంగా కీర్తిపొందిన నన్నయ, తిక్కన, ఎర్రనతోపాటు అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు కీర్తనలతో.. వేమన పద్యాలు తెలుగు భాషకు మణిమకుటాలు. మాజీ ప్రధాని, తెలుగు వ్యక్తి అయిన పీవీ నరసింహారావు తన హయాంలో అనేక ఆర్థిక సంస్కరణలు చేశారు. సి.నారాయణరెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి భాషాభివృద్ధికి ఎంతో కృషిచేశారు. సాంకేతిక విద్య తెలుగులోనూ ఉండాలి. భావితరాలకు భాషా మాధుర్యాన్ని పంచాలి. భాషాభివృద్ధికి అమలాపురం కిమ్స్, జీజీయూ ఆధ్వర్యంలో తెలుగు మహాసభలు నిర్వహించడం అభినందనీయం.

## గల్ఫ్ దేశాల్లో ఉన్న రాష్ట్ర ప్రజలు ఆందోళన పడొద్దు

-మొదటిపేజీ తరువాయి

ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకూ సంయమనం పాటించాలని, త్వరలోనే విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయని మంత్రి తెలిపారు. ఇండియన్ ఎంబసీ లో ఆయా దేశాల్లో ఉన్న రాష్ట్ర పౌరులందరూ నమోదు చేసుకోవాలని మంత్రి కొండపల్లి కోరారు. ఇరాన్, ఇజ్రాయెల్ ప్రాంతాల్లో ఉన్న భారతీయుల భద్రత పై కేంద్ర ప్రభుత్వం, భారత విదేశాంగ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, మీడియా ద్వారా సరైన సమాచారం తెలుసుకుని, ఎప్పటి కప్పుడు ఇండియన్ ఎంబసీలకు అందుబాటులో ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. గగనతలంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల కారణంగా విమానాల రవాణా ఆలస్యం అవుతోందని, త్వరలోనే విమానయాన సేవలు పునరుద్ధరిస్తామని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు, ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండేందుకు ప్రయత్నం చేయాలని రాష్ట్ర పౌరులను మంత్రి కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఇస్తున్న ఆదేశాలు, సూచనల మేరకు ఎప్పటికప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరుపుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రభావిత దేశాల్లో ఉన్న రాష్ట్ర పౌరులందరినీ కాపాడేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులలో ఏపీ ఎన్నార్టీ హెల్ప్ లైన్ నెంబర్లు +91 8500027678, +91 0863 2340678 నంబర్లకు కాల్ చేయాలని, మరింత సమాచారం కోసం https://apnrts.ap.gov.in/ వెబ్ సైట్ ను సంప్రదించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఏ విధమైన తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా, స్థానిక అధికారులు, అధికారిక మీడియా ప్రకటనల సమాచారం మాత్రమే ఫాలో కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.

## మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ అత్యవసర సమావేశం

రెండు రోజుల రాష్ట్రాల పర్యటన ముగించుకుని ఢిల్లీకి రాగానే ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం రాత్రి అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో.. దేశ అత్యున్నత నిర్ణయాక వ్యవస్థ అయిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్)తో ఆయన భేటీ కానున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా వైమానిక దాడులు చేయడం, ఇదే సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంతో గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఈ పరిణామాల దృష్ట్యా భారత్ అప్రమత్తమైంది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, పుదుచ్చేరి పర్యటనలు ముగించుకుని రాత్రి 9:30 గంటల సమయంలో ప్రధాని ఢిల్లీ చేరుకుంటారు. వచ్చిన వెంటనే రక్షణ, హోం, విదేశాంగ, ఆర్థిక శాఖ మంత్రులతో కూడిన సీసీఎస్ బృందంతో సమావేశమవుతారు.

ఈ అత్యవసర భేటీలో ప్రధానంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, భారత్‌పై వాటి ప్రభావం గురించి చర్చించనున్నారు. ముఖ్యంగా యూఏఈ, ఇతర గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల భద్రత, ఇంధన భద్రత (చమురు ధరలు), సముద్ర వాణిజ్య మార్గాల రక్షణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అవసరమైతే భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు (ఎవాక్యుయేషన్) తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపైనా చర్చ జరగనుంది. అంతర్జాతీయంగా పరిస్థితులు వేగంగా మారుతున్న వేళ.. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునేందుకు మోదీ సర్కార్ ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.


# ఇరాన్‌పై పోరులో తొలిసారిగా అమెరికాకు ప్రాణనష్టం... ముగ్గురు సైనికుల మృతి

## తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ఐదుగురు సైనికులు

## యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌పై దాడి వార్తలను ఖండించిన అమెరికా

## కొనసాగుతున్న మేజర్ కంబాట్ ఆపరేషన్స్

## ఇప్పటికే దాడుల్లో మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ



ఇరాన్‌పై అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో తొలిసారిగా అగ్రరాజ్యానికి ప్రాణనష్టం చోటుచేసుకుంది. ఈ ఆపరేషన్‌లో తమ దేశానికి చెందిన ముగ్గురు సర్వీస్ మెంబర్స్ (సైనికులు) మరణించారని, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది.
ప్రస్తుతం అక్కడ మేజర్ కంబాట్ ఆపరేషన్స్ (భారీ స్థాయి యుద్ధ చర్యలు) కొనసాగుతున్నాయని, పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉందని అధికారులు తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు సమాచారం అందించిన 24 గంటల తర్వాతే వారి వివరాలను వెల్లడిస్తామని సైన్యం స్పష్టం చేసింది. మరికొందరు సైనికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని, వారికి చికిత్స అందించి తిరిగి విధుల్లోకి తీసుకుంటామని పేర్కొంది. ఇరాన్ మిలిటరీ, సెక్యూరిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా ఈ ఆపరేషన్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. మరోవైపు, తమ యుద్ధ నౌక 'యూఎస్ఎస్ అబ్రహం లింకన్'పై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశారన్న వార్తలను సెంట్రల్ కమాండ్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్ క్షిపణులు తమ నౌక దరిదాపుల్లోకి కూడా రాలేదని, ఆ వార్తలు పచ్చి అబద్ధమని కొట్టిపారేసింది. అబ్రహం లింకన్ నౌక సురక్షితంగా ఉందని, ఇరాన్ ముప్పును ఎదుర్కోవడంలో కీలక పాత్ర పోషిస్తోందని స్పష్టం చేసింది. ఇప్పటికే అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీతో పాటు ఆ దేశ అగ్రనేతలు మరణించిన నేపథ్యంలో.. తాజా పరిణామాలు వాషింగ్టన్‌లోనూ చర్చనీయాంశంగా మారాయి. సైనికుల మరణాలతో ఈ ఆపరేషన్ లక్ష్యాలు, కాలపరిమితిపై అమెరికా చట్టసభ సభ్యులు ఆరా తీస్తున్నారు.

## పాము తల నరికేశాం: ఇరాన్ సైనిక ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేశామన్న అమెరికా

ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేశామని అమెరికా ప్రకటన

ఖమేనీ మృతితో ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్

ఈ ఘర్షణల్లో ముగ్గురు అమెరికా సైనికులు మృతి చెందినట్లు నిర్ధారణ

ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా సంయుక్త దాడులు కొనసాగింపు



మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలుముకున్నాయి. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రధాన కార్యాలయాన్ని పూర్తిగా ధ్వంసం చేశామని అమెరికా సైన్యానికి చెందిన సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. 'పాము తల నరికేశాం' అంటూ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ దాడితో ఇకపై ఐఆర్‌జీసీకి ప్రధాన కార్యాలయం అంటూ ఏదీ లేదని స్పష్టం చేసింది.ఆదివారం సెంట్‌కామ్ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించింది. "గత 47 ఏళ్లలో ఐఆర్‌జీసీ 1,000 మందికి పైగా అమెరికన్ల మృతికి కారణమైంది. నిన్నటి భారీ దాడితో ఆ పాము తల నరికేశాం. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైన్యం అమెరికా సొంతం" అని సెంట్‌కామ్ పేర్కొంది.ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఇరాన్‌పై శనివారం నుంచి సంయుక్త సైనిక చర్యలు చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటికే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీతో పాటు పలువురు సీనియర్ సైనిక కమాండర్లు మరణించారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్ కూడా అమెరికా సైనిక స్థావరాలు, ఇజ్రాయెల్‌పై పెద్ద ఎత్తున క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తోంది.
'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో ఇప్పటివరకు తమ సైనికుల్లో ముగ్గురు మరణించగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు సెంట్‌కామ్ అధికారికంగా ధ్రువీకరించింది. ఇరు పక్షాలు దాడులను కొనసాగిస్తామని ప్రకటించడంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు తారాస్థాయికి చేరాయి.

# హోర్మూజ్ జలసంధిని మూసేసిన ఇరాన్..




✹ భారత్ సహా ప్రపంచ దేశాల పై ప్రభావ మెంత?

**ఇంటర్నెట్ డెస్క్:** మధ్యప్రాచ్యంలో తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని మూసేస్తూ ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గంగా ఉన్న ఈ సన్నని హర్మూజ్ జలసంధి మూసివేతతో భారత్ సహా అంతర్జాతీయంగా చాలా దేశాల పై తీవ్ర ప్రభావం పడనుంది. ప్రపంచ చమురు సరఫరాకు కీలకంగా ఉన్న ఈ హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో అంతర్జాతీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరగనున్నాయి. దీని ప్రభావం భారత్ పై మరింత ఎక్కువగానే ఉండే అవకాశాలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న దాడులు తీవ్రతరం అయ్యాయి. అదే సమయంలో ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్ పలు ముస్లిం దేశాల పైనా విరుచుకు పడుతుండటంతో మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. ఇరాన్, యూఏఈ దాడుల నేపథ్యంలో హోర్మూజ్ జలసంధిని ఇరాన్ దళాలు మూసివేశాయి. ప్రపంచ చమురు రవాణాలో ఎక్కువ శాతం ఈ హర్మూజ్ జలసంధి నుంచే జరుగుతుండగా ఇప్పుడు దాన్ని మూసివేయడం ప్రపంచ దేశాలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ప్రపంచం లోనే ప్రధాన ఆయిల్ ఉత్పత్తి దేశాలైన ఇరాక్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లను గల్ఫ్ ఆఫ్ ఒమన్, అరేబియా సముద్రంతో ఈ హర్మూజ్ జలసంధి కలుపుతుంది. ఈ హర్మూజ్ జలసంధి గుండా నిత్యం లక్షల బ్యారెల్ల ముడి చమురు ఆయా దేశాలకు ఎగుమతి అవుతూ ఉంటుంది. ఇలాంటి వ్యూహాత్మక, కీలక మార్గాన్ని ఇరాన్ ఆర్మీ మూసివేయడంతో అంతర్జాతీయ మార్కెట్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందనే భయాలు వెల్లువెత్తుతున్నాయి. దాని వల్ల చమురు ధరలు ఆకాశాన్నంటే పరిస్థితి ఉంటుందని నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు.

# ఇరాన్‌లో ఖమేనీ మృతి.. పాకిస్తాన్‌లో ఉద్రిక్తతలు.




**పాకిస్తాన్:** ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతితో పాకిస్తాన్ లో ఉద్రిక్తత నెలకొంది. పాక్ లోని అమెరికా కాన్సులేట్ పై ఆందోళనకారులు దాడులకు దిగారు. దీంతో వారిని అదుపు చేసేందుకు పోలీసులు రంగం లోకి దిగడంతో.. తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు లాఠీఛార్జ్, కాల్పులు జరిపారు. ఈ ఘటనల్లో 12 మంది దుర్మరణం చెందగా పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. పాక్ నగరాల్లో మరిన్ని నిరసనలు జరగనుండటంతో ఆ దేశం లోని పౌరులకు అమెరికా హెచ్చరికలు చేసింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్ పై జరిపిన భీకర దాడుల్లో ఆ దేశ సుప్రీం అధినేత అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అయితే ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌తోపాటు మరికొన్ని ముస్లిం దేశాల పై తీవ్ర స్థాయిలో క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతారవణం నెలకొంది. అమెరికా సహకారంతో ఇరాన్ పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులతో ప్రపంచ దేశాల్లో కూడా అక్కడక్కడా నిరసనలు, ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. అయితే ఇవి పాకిస్తాన్‌లో మరింత ఎక్కువగానే ఉన్నాయి. పాక్‌లో నిరసన చేస్తున్న వారిని అడ్డుకునేందుకు పోలీసులు చేసిన పని 10 మంది ప్రాణాలను తీసింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యను వ్యతిరేకిస్తూ పాకిస్తాన్ లోని కరాచీలో ఆందోళనలు చెలరేగాయి. పలువురు ఆందోళనకారులు అక్కడి యూఎస్ కాన్సులేట్ పై దాడికి దిగారు. కర్రలు, రాళ్లతో విరుచుకుపడటంతో పరిస్థితి తీవ్రతరం అయింది. ఆ తర్వాత అమెరికా కాన్సులేట్‌కు నిప్పు అంటించేందుకు ఆందోళనకారులు ప్రయత్నాలు చేయగా వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో లాఠీఛార్జ్ చేశారు. అయినప్పటికీ ఆందోళనలు ఆగకపోవడంతో కాల్పులకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు, నిరసనకారులకు మధ్య జరిగిన ఘర్షణలు తీవ్రంగా మారాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా మెరైన్ సెక్యూరిటీ సిబ్బంది జరిపిన కాల్పుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోవడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. మరో 30 మందికి పైగా గాయాల పాలయ్యారు. ఖమేనీ మృతికి పాకిస్తాన్‌లో ఉన్న ఇరాన్ రాయబార కార్యాలయం సంతాపం తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ ఖమేనీని లక్ష్యంగా చేసుకుని దాడి చేసి చంపేయడాన్ని వారి పిరికిపంద చర్యగా అభివర్ణించింది. ఖమేనీ మరణానికి నిరసనగా పాకిస్తాన్ లోని షియా సంఘాలు కరాచీ లోని అమెరికా దౌత్య కార్యాలయం వైపు భారీ ర్యాలీగా వెళ్లాయి. వాషింగ్టన్, టెల్ అవీవ్‌కు వ్యతిరేకంగా నిరసనకారులు నినాదాలు చేస్తూ బారికేడ్లను తోసుకుని అమెరికా కాన్సులేట్ లోపలికి వెళ్లేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. పరిస్థితి చేయి దాటి పోవడంతో యూఎస్ కాన్సులేట్ రక్షణలో ఉన్న అమెరికా మెరైన్ సిబ్బంది కాల్పులు జరిపినట్లు పాకిస్తాన్ మీడియా వెల్లడించింది.
అయితే కేవలం కరాచీలో మాత్రమే కాకుండా పాకిస్తాన్ లోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ఖమేనీ మృతికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారి తీశాయి. వందలాది మంది నిరసనకారులు లాహోర్ లోని అమెరికా కాన్సులేట్ ముందు బైఠాయించారు. రోడ్డు పైనే ప్రార్థనలు చేసి, అమెరికా వ్యతిరేక నినాదాలు చేశారు. పోలీసులు భారీగా మోహరించడంతో అక్కడ ఎలాంటి హింస చెలరేగలేదు. అటు ఉత్తర పాకిస్తాన్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళన కారులు ఐక్యరాజ్యసమితి కార్యాలయ భవనానికి నిప్పు అంటించడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అక్కడ ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ భారీగా ఆస్తి నష్టం జరిగింది. పాకిస్తాన్‌లో ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఇస్లామాబాద్ లోని అమెరికా రాయబార కార్యాలయం తమ దేశ పౌరులకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. కరాచీ, లాహోర్, పెషావర్ నగరాల్లో మరిన్ని నిరసనలు జరిగే అవకాశాలు ఉన్నందున.. అప్రమత్తంగా ఉండాలని అమెరికా పౌరులకు సూచించింది.

## 15లోపు పట్టాలిస్తాం.. ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం!

- 'మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది.. మీకు అండగా నిలుస్తాం'
- వెలుగుమట్ల నిర్వాసితులకు మంత్రి పొంగులేటి అభయం
- దళారుల 'దగా'పై ఉక్కుపాదం.. బాధితులకు 'సర్కారు' దన్ను
- పదేళ్లు కళ్లు మూసుకుని.. ఇప్పుడొచ్చి మొసలి కన్నీరా?
- ప్రతిపక్షాలపై మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి ధ్వజం



**ఖమ్మం పెన్ సత్తా,మార్చి 01:** : అప్పులు చేసి నిర్మించుకున్న ఆశల గూడు కూలిపోయిందని ఆవేదన చెందకండి.. ఈ ప్రభుత్వం మీది. మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది. అర్హులైన ప్రతి పేదవాడికి ఈ నెల 15వ తేదీలోపు ఇళ్ల స్థలాల పట్టాలతో పాటు రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెలుగుమట్ల బాధితులకు భరోసానిచ్చారు. ఆదివారం ఖమ్మం ఐడిఒసి వేదికగా జరిగిన బాధితుల ముఖాముఖిలో మంత్రి వారి కష్టాలను స్వయంగా విని చలించిపోయారు.

దళారుల నుంచి డబ్బులు వసూలు చేయించి ఇస్తామని హామీ

వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కొన్నేళ్లుగా దళారుల ఉచ్చులో చిక్కి, నిరుపేదలు అనుభవిస్తున్న నరకయాతన మంత్రి ఎదుట వెలుగుచూసింది. తక్కువ ధరకే స్థలం వస్తుందని నమ్మి, రెక్కాడితే గానీ డొక్కాడని తాము రూ. 30 వేల నుంచి రూ. 8 లక్షల వరకు అప్పులు చేసి దళారులకు చెల్లించామని మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తీరా ఇల్లు కట్టుకున్నాక అధికారులు వచ్చి కూల్చేయడంతో తామంతా దిక్కుతోచని స్థితిలో పడ్డామన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఒక్క పైసా కూడా ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పనిలేదని, పేదల రక్తం తాగిన ఆ దళారుల నుంచి డబ్బును రికవరీ చేయిస్తామని బాధితులకు గట్టి హామీ ఇచ్చారు.

చీకటి బతుకుల నుంచి వెలుగు కాలనీల వైపు

గత 9 నెలలుగా కరెంటు, నీరు, ఇతర మౌలిక సదుపాయాలు లేక చీకట్లో మగ్గుతున్నామని బాధితులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి... కేవలం ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడమే కాకుండా, కొత్తగా నిర్మించే కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీతో పాటు అంగన్వాడీ, పాఠశాలలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని వివరించారు. నియోజకవర్గాల వారిగా బాధితులను గుర్తించి, వారి వారి ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు.

రాజకీయ శవాల మీద చిల్లర ఏరుకోవద్దు

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో... బాధితుల సానుభూతి కోసం పాకులాడుతున్న ప్రతిపక్ష నేతలపై మంత్రి పొంగులేటి నిప్పులు చెరిగారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ఈ పేదలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. అధికారం పోగానే షెడ్ల కింద కూర్చుని డ్రామాలు ఆడుతున్నారని, రాజకీయాల కోసం పేదలను కవచంలా వాడుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. మీ పార్టీ ఏదైనా సరే.. మీరు నిజమైన పేదలైతే ఈ ప్రభుత్వం మీకు ఇల్లు ఇచ్చి తీరుతుందని, రాజకీయాలకు అతీతంగా పారదర్శకమైన సర్వే ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రకటించారు.

అర్హులకే పట్టా.. మార్చి 15 'డెడ్ లైన్'

గతంలో లబ్ధి పొందిన వారిని ఏరివేసి, కేవలం నిరుపేదలకే న్యాయం జరిగేలా సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15వ తేదీన తానే స్వయంగా వచ్చి అర్హులైన కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల ఆర్డర్లు అందజేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. అధికారులే నేరుగా బాధితుల వద్దకు వస్తారని, మరోమారు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమేనీ మృతితో సంబరాల్లో మహిళలు..

- చిత్ర పటం మంటతో సిగరెట్లు తాగుతూ..!





**ఇంటర్నెట్ డెస్క్:** ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. ఒకదాని పై మరొకటి క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసుకున్నాయి. అయితే ఇరాన్ పై జరిపిన దాడుల్లో సుప్రీ లీడర్ ఖమేనీ మృతి చెందినట్లు ఇరాన్ మీడియా ధృవీకరించింది. అంతేకాక ఈ దాడుల్లో ఖమేనీ కుమార్తె, మనవడు, కోడలు, అల్లుడు మరణించినట్లు వెల్లడించింది. అయితే ఖమేనీ మరణంతో ఇరాన్ లోని యువత సంబరాలు చేసుకుంటున్నారు. అందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'.. పేరుతో ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతిచెందినట్లు ఇరాన్ మీడియా పేర్కొంది. ఇదే విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం అధికారికంగా ప్రకటించారు. ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరణించినట్లు తెలిపారు. ఖమేనీని చరిత్ర లోనే అత్యంత క్రూరమైన వ్యక్తులలో ఒకరిగా ఈ మేరకు ట్రంప్ అభివర్ణించారు. అయితే ఖమేనీ మృతితో ఇరాన్ లోని యువత సంబరాలు చేసుకుంటున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వీడియోలు ప్రత్యక్షం అవుతున్నాయి. అటు ఆందోళనకారులు కూడా పెద్ద ఎత్తున రోడ్ల పైకి వచ్చి సంబరాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట ట్రెండ్ అవుతోంది. ఖమేనీ మరణవార్త విన్న ఆ మహిళ సంతోషం వ్యక్తం చేస్తూ ఈ వీడియోను చిత్రీకరించారు. మోర్టిసియా ఆడమ్స్(25) అనే మహిళ ఖమేనీ మృతి పై తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఖమేనీ ఫోటోకు నిప్పు అంటించి ఆ మంటతో సిగరెట్ వెలిగించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలోనూ ఖమేనీ ఫోటోను తగలబెట్టి ఆ మంటతో సిగరెట్ వెలిగించుకున్న వీడియో చేశారు. ఆ వీడియోతో ఒక్కసారిగా ఆమె ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారు. వీటితో పాటు హిజాబ్ లేకుండా కనిపించడం, బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్ తాగడం, దేశ అత్యున్నత నాయకుడిని అవమానించడం తదితర చర్యల ద్వారా ఆమె ఇరాన్ నిరసనకారులకు ప్రతిరూపంగా నిలిచారు.

## అంగన్వాడీలకు 2 సార్లు వేతనాలు పెంచింది ముఖ్యమంత్రి చంద్రబాబే

- మీ డిమాండ్ల పై ప్రభుత్వం సానుకూలంగా ఉంది.
- అంగన్వాడీలంతా అర్థం చేసుకోవాలని పరిటాల శ్రీరామ్ పిలుపు.
- గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా గమనించాలని విజ్ఞప్తి.



**ధర్మవరం, పెన్ సత్తా, మర్చి 01:** అంగన్వాడీలకు గతంలో ఎప్పుడూ ఎవరూ చేయని విధంగా రెండు సార్లు వేతనాలు పెంచింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమేనని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ప్రస్తుతం అంగన్వాడీలు తమ డిమాండ్ల కోసం ఆందోళన బాట పట్టిన నేపథ్యంలో ఆయన ప్రత్యేకంగా కొన్ని అంశాల గురించి ప్రస్తావించారు. గత ప్రభుత్వంలో మీకు ఎలాంటి మేలు జరిగింది, ఇప్పుడు ఏం జరుగుతోందన్నది పునఃపరిశీలన చేసుకోవాలని శ్రీరామ్ సూచించారు. జగన్ రెడ్డి అవలంభించిన విధానాలతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ అన్ని సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు కెళ్తున్నారన్నారు. ఈ క్రమంలో అంగన్వాడీలకు గతంలో ఇచ్చిన హామీల గురించి కూడా ప్రభుత్వం పరిశీలన చేస్తోందన్నారు. అయితే ఈ 20 నెలల కాలంతో పాటు గతంలో అంగన్వాడీలకు ఏం చేశామన్నది ఒక్కసారి వారే గమనించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగు దొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు అందేలా చర్యలు తీసుకుని, జీతాల ఆలస్యానికి శాశ్వతంగా చెక్ పెట్టిందన్నారు. 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్ వైజర్లు, బ్లాక్ కో ఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5జి స్మార్ట్ ఫోన్లు అందించిందన్నారు. అంగన్వాడీ కేంద్రాల హాజరు 70 శాతం నుంచి 96 శాతానికి పెరగడం కూటమి పాలనకు వచ్చిన ప్రత్యక్ష ఫలితం కనిపిస్తోందన్నారు. ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురు చూసిన గ్రాట్యుటీ కలను కూటమి ప్రభుత్వం నిజం చేసిన విషయాన్ని ఎవరూ మర్చిపోవదన్నారు. గ్రాట్యుటీ చెల్లింపుల కోసం 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ లోనే రూ.20 కోట్లు కేటాయించి, అధికారం లోకి వచ్చిన 9 నెలల్లోనే అంగన్వాడీలకు అండగా నిలిచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తోందన్నారు. వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంత వరకు అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనిని అంగన్వాడీలు గమనించాలని శ్రీరామ్ సూచించారు.

# ఇరాన్‌తో యుద్ధం 4 వారాల్లో ముగింపు: డొనాల్డ్ ట్రంప్

### తొలిసారిగా అమెరికా సైనికులు మృతిచెందినట్లు నిర్ధారణ

### ఇరాన్ కొత్త నాయకత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నానన్న ట్రంప్

### సైనిక చర్య పూర్తి స్థాయిలో కొనసాగుతుందని స్పష్టీకరణ



ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక ఘర్షణ సుమారు నాలుగు వారాల్లో ముగియవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంచనా వేశారు. ఇదే సమయంలో 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' అనే ఈ సైనిక చర్యలో తొలిసారిగా అమెరికా సైనికులు మరణించినట్లు ఆయన ధ్రువీకరించారు. మరోవైపు, ఇరాన్ కొత్త నాయకత్వంతో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నానని కూడా సంకేతాలిచ్చారు.

ఆదివారం పలు మీడియా సంస్థలతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో యుద్ధం మొదలైన తర్వాత తొలిసారిగా అమెరికాకు నష్టం వాటిల్లినట్లు అంగీకరించారు. కువైట్‌లోని స్థావరంలో ఉన్న అమెరికా సైనికుల్లో ముగ్గురు మరణించగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది. "ఇది చాలా పెద్ద దేశం, అందుకే దీనికి నాలుగు వారాలు లేదా అంతకంటే తక్కువ సమయం పట్టొచ్చు" అని ట్రంప్ ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అణ్వాయుధాలు సంపాదించకుండా ఇరాన్‌ను నిరోధించడం, ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఇజ్రాయెల్‌తో కలిసి ఈ సైనిక చర్య చేపట్టినట్లు ట్రంప్ వివరించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత ఏర్పడిన కొత్త నాయకత్వంతో చర్చలు జరపడానికి తాను అంగీకరించానని చెప్పారు. "వారు చర్చలు కోరుకుంటున్నారు, నేను దానికి అంగీకరించాను" అని తెలిపారు. అయితే, సైనిక చర్య పూర్తి స్థాయిలో కొనసాగుతుందని, నిర్దేశిత లక్ష్యాలు పూర్తయ్యే వరకు దాడులు ఆగవని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘర్షణ ముగిసేలోపు మరిన్ని ప్రాణనష్టాలు జరిగే అవకాశం ఉందని కూడా ఆయన హెచ్చరించడం గమనార్హం.

# కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించిన పెమ్మసాని









**గుంటూరు, పెన్ సత్తా, మర్చి 01:** కొల్లూరు మండలం లోని పెదపరిమి గ్రామంలో దాతలు సూద్నగుంట డా. రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి గార్ల సహకారంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు.సరిగ్గా 8 నెలల క్రితం ఇదే కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన నిర్వహించిన పెమ్మసాని ప్రారంభోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దాతలు డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి లకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, పెదపరిమి గ్రామస్తులు అందరూ కలిసి సన్మాన కార్యక్రమంతో గౌరవించారు. అనంతరం పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కర్త, కర్మ, క్రియ అయిన డా. రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి ప్రసాద్ లకు ముందుగా నా ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. ఆయనకు సంబంధం లేకపోయినా సరే తన సొంత కష్టం నుంచి రూ. 4 కోట్లను వెచ్చించి మనకోసం, మన గ్రామం కోసం ఈ కమ్యూనిటీ హాల్ను నిర్మించారు. ఈ భవనానికి శంకుస్థాపన చేసిన నాటి నుంచి ఈరోజు వరకు నిర్మాణం లోని ప్రతి అంశం పై ప్రత్యేక శ్రద్ధ వహించాము. డబ్బులు చాలామంది సంపాదిస్తారు కానీ, ఆ డబ్బులు సరైన పద్ధతిలో ప్రజలకు అందేలా ఖర్చు పెట్టగలగడం కొందరికే సాధ్యమవుతుంది. ఇంత నిర్మాణం చేసినా సరే ఈ నిర్మాణానికి కాంపౌండ్ వాల్ ను కూడా ఉంటే బాగుంటుంది అనే ఉద్దేశంతో, ఆయనే ముందు కొచ్చి ఆ నిర్మాణాన్ని చేపడతానని భరోసా ఇస్తున్నారు, అది ఆయన మంచితనం. ఈ భవనం కేవలం శుభకార్యాలకు మాత్రమే కాకుండా పిల్లలకు విద్యను అభ్యసించేందుకు స్కిల్ డెవలప్మెంట్ పెంపొందించుకునేందుకు యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఉపయోగించుకోవాలని కోరుకుంటున్నాను. కేవలం నిర్మాణంతో సరిపెట్టకుండా నిర్వహణను కూడా జాగ్రత్తగా చూసుకుని రూపాయికి రూపాయి లెక్కలను జాగ్రత్తగా పర్యవేక్షించుకుంటూ, ఈ దాతల కష్టానికి సరైన ప్రతిఫలాన్ని అందిస్తారని ఆశిస్తున్నాను అన్నారు. అమరావతిలో రోడ్ల పై ప్రయాణిస్తూ ఉంటే ఇక్కడి అద్భుత కట్టడాలు, నిర్మాణాలు కనపడుతున్నాయి. ఒకే ఒక సంవత్సరంలో ఇక్కడ అద్భుతమైన భవనాలు మన కళ్ళ ముందు నిలవబోతున్నాయి. ఇలాంటి నిర్మాణాలను నగరాన్ని కళ్ళ ముందు చూస్తున్న మీరందరూ నిజంగా అదృష్టవంతులని భావిస్తున్నానన్నారు. మరి రెండేళ్లు పోతే కొంత మంది నాయకులు అబద్ధాలు చెప్పి మిమ్మల్ని మాయ పుచ్చడానికి వస్తారు. వాళ్లందరికీ ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి సమాధానంగా మీరందరూ నిలదీయాలన్నారు. తరువాత డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ కళ్యాణి మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నేను కేవలం డబ్బులు మాత్రమే అందించాను. కానీ నమ్మకంగా ఇచ్చిన ప్రతి రూపాయిని ప్రజల కోసం ఖర్చుపెట్టి ఇంతటి భవనాన్ని నిర్మించి, ప్రజలకు అందించిన పెమ్మసాని కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కమ్యూనిటీ హాల్ కోసం కాంపౌండ్ వాల్ అడుగుతున్నారు. గ్రామస్తులు అందరూ కలిసి రూ.12 లక్షలు ఇస్తే, మిగిలిన రూ. 12 లక్షలు నేను ఇచ్చి రూ. 25 లక్షలతో ఈ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి చర్యలు చేపడతానన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఒక ఎంపీ గా దిల్లీ కి మాత్రమే పరిమితం కాకుండా పార్లమెంటు పరిధి లోని ప్రతి ప్రాంతంలో అభివృద్ధి కోసం పెమ్మసాని చంద్రశేఖర్ కృషి చేస్తున్నారు. స్థానికంగా పెద్ద పరిమిలో ఉన్న అవసరాల దృష్ట్యా ఈ కమ్యూనిటీ హాల్ను ఆయన ప్రత్యేక తీసుకొని నిర్మింప చేశారు. ఈ భవన నిర్మాణానికి సహకరించిన దాతలు ఎవరో మనకు తెలియక పోయినా మన కోసం, పెమ్మసాని చంద్రశేఖర్ అడిగినంతనే ముందుకొచ్చి విరాళ మందించిన సోదిన గుంట రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి లకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము అన్నారు. స్థానిక ప్రజల అవసరాల నిమిత్తము నేను, ఎంపీ పునరాలోచించి మరిన్ని అవసరాలను ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి యార్లగడ్డ

**గన్నవరం, పెన్ సత్తా, మార్చి 01:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో ఎన్నడు లేని విధంగా చరిత్రలో తొలిసారి అంగన్వాడీ టీచర్ల వేతనాలను రెండుసార్లు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు. అంగన్వాడీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నట్లు స్పష్టం చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 కోట్లు విడుదల చేసి చేసిన సంగతి గుర్తు చేశారు. అంగన్వాడీలకు ప్రతినెలా ఒకటో తేదీని వేతనాలు ఇస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కో ఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5జి స్మార్ట్ఫోన్లు అందచేసినట్లు చెప్పారు. గ్రాట్యూటీ చెల్లింపుల కోసం 2025 రాష్ట్ర బడ్జెట్లో రూ. 20 కోట్లు కేటాయించి అంగన్వాడీలకు అండగా నిలిచామన్నారు. అంగన్వాడి కేంద్రాలకు టీవీ, ఆర్వో, టాయిలెట్ సౌకర్యాలు కల్పించడంతోపాటు టీచర్లకు, ఆయాలకు వేసవిలో 15 రోజులు సెలవులు ఇస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐదువేల మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేసి మినీ అంగన్వాడి కార్యకర్తలకు టీచర్లుగా పదోన్నతులు కల్పిస్తున్నామని, 5 వేల మంది అంగన్వాడి సహాయకులను



నియమించ బోతున్నట్లు యార్లగడ్డ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల అంగన్వాడీల్లో హాజరు 70 నుంచి 96 శాతానికి పెరగటం శుభ పరిణామం అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వారికి ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని వెంకట్రావు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో వేధింపులు, ఇబ్బందులకు గురైన ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ హామీ ఇచ్చారు.

# బీ.సీ కమ్యూనిటీ హాలును ప్రారంభించిన పెమ్మసాని





**గుంటూరు, పెన్ సత్తా, మార్చి 01:** తాడికొండ మండలం లోని రావెల గ్రామంలో దాతలు సూద్నగుంట రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి చొరవతో నిర్మించిన బీ.సీ కమ్యూనిటీ హాలును స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. అమెరికాలో వైద్యునిగా పనిచేస్తున్న డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ అందించిన విరాళంతో, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చొరవతో రావెల గ్రామ ప్రజల కోసం 9 నెలల క్రితం శంకుస్థాపన చేసుకున్న ఈ కమ్యూనిటీ హాలుకు తిరిగి పెమ్మసాని గారే ప్రారంభోత్సవం చేయడం విశేషం. కార్యక్రమంలో భాగంగా దాత లైన డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ ని, ఆయన సతీమణి కళ్యాణి ప్రసాద్ ను రావెల గ్రామ ప్రజలు సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఈ నియోజకవర్గానికి, ఈ గ్రామానికి ఎలాంటి సంబంధం లేకపోయినా సరే ప్రజల అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం తాను వైద్యునిగా సంపాదించిన సంపాదన నుంచి రూ. 4 కోట్లను కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అందజేసిన సూద్నగుంట రాఘవేంద్ర ప్రసాద్, ఆయన సతీమణి కళ్యాణి ప్రసాద్ లకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు. ఈ కమ్యూనిటీ హాలును 9 నెలల క్రితం శంకుస్థాపన జరుపుకొని, తిరిగి ప్రారంభోత్సవం జరుపుకోవడం నిజంగా గర్వించదగ్గ అంశం. ఇలాంటి నిర్మాణాలను చేపట్టాలని కోరుతూ దాతలు అందించిన ప్రతి ఒక్క రూపాయిని ఖర్చు పెడుతూ, ఎక్కడా అవినీతి జరగకుండా చూసిన మా స్టాఫ్ కు అభినందనలు తెలియజేస్తున్నాను. చరిత్రలో నిలబడిపోయి రాజధానిని అమరావతిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీర్చిదిద్దుతున్నారు. ప్రపంచ రాజధానిగా ఎదగబోతున్న ఈ అమరావతి నిర్మాణాన్ని మన కళ్ళ ముందు చూడడం మన అదృష్టం అన్నారు. అనంతరం డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ కళ్యాణి మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నేను కేవలం డబ్బులు మాత్రమే అందించాను. కానీ నమ్మకంగా ఇచ్చిన ప్రతి రూపాయిని ప్రజల కోసం ఖర్చుపెట్టి ఇంతటి భవనాన్ని నిర్మించి, ప్రజలకు అందించిన పెమ్మసాని కి ధన్యవాదాలు. ఏమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ దాతలు సూద్నగుంట రాఘవేంద్ర ప్రసాద్, ఆయన సతీమణి కళ్యాణి చేసిన సహాయం కారణంగా ఈరోజు ఈ కమ్యూనిటీ హాల్ నిర్మింపబడిందన్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమసాని చంద్రశేఖర్ కి ఉన్న సత్సంబంధాలతో రాఘవేంద్ర ప్రసాద్ ని కలిసి జిల్లా పరిధిలో 9 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి సహకారం తీసుకున్నారు. ఆ ఇరువురి చొరవ కారణంగానే నేడు రావెల గ్రామం లోని ఈ బీ.సీ కమ్యూనిటీ హాల్ నిర్మింపబడింది. అభివృద్ధిని చేపట్టగల, నిధులు రాబట్ట గల చాకచక్యం చొరవ పెమ్మసాని కి మాత్రమే ఉందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గం జనసేన సమన్వయకర్త బేతపూడి విజయ శేఖర్, నియోజకవర్గ బిజెపి సమన్వయకర్త బ్రహ్మయ్య, మండల పార్టీ ప్రెసిడెంట్ తలసిల్ల ప్రసన్న కుమార్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుంటుపల్లి మధుసూదన్ రావు, ఖాదీ బోర్డు డైరెక్టర్ యడ్లపల్లి సాంబశివ రావు, రావెల గ్రామ మాజీ సర్పంచ్ దగ్గు మల్లీ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్ర రావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, మాజీ సర్పంచ్ పాములు తదితరులు పాల్గొన్నారు.



# బాణాసంచా తయారీ కేంద్రాల పై పోలీసుల విస్తృత తనిఖీలు

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు - జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా**

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 01:** కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణా సంచా తయారీ కేంద్రవద్ద జరిగిన దురదృష్టకర సంఘటనను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా బాణాసంచా తయారీ, నిల్వ కేంద్రాలలో జిల్లా పోలీస్ యంత్రాంగం ముందస్తు తనిఖీలు చేపట్టింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా రంగం లోకి దిగి, జిల్లా లోని అన్ని సబ్-డివిజన్ల పరిధిలో తనిఖీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ డీఎస్పీల పర్యవేక్షణలో అన్ని స్టేషన్ల హౌస్ ఆఫీసర్లు, ఫైర్, రెవెన్యూ శాఖల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ ఉన్న అనధికారిక యూనిట్ల పై దాడులు నిర్వహించారు. తనిఖీల్లో ప్రధానంగా పరిశీలించిన అంశాలు: ఎక్స్‌ప్లోజివ్ రూల్స్, (పేసో) నిబంధనల ప్రకారం చెల్లుబాటు అయ్యే తయారీ, నిల్వ లైసెన్స్‌లు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. షెడ్లలో అనుమతించిన పరిమితికి మించి పేలుడు పదార్థాలను నిల్వ చేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మిక్సింగ్, ఫిల్లింగ్, ప్యాకింగ్, ఎండబెట్టే విభాగాలు నిబంధనల ప్రకారం నిర్ణీత దూరంలో ఉన్నాయో లేదో పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా స్పార్క్-ప్రూఫ్ సిస్టమ్స్, ఎర్తింగ్ సౌకర్యాలను తనిఖీ చేశారు. శిక్షణ పొందిన వ్యక్తులే పని చేస్తున్నారా?, చైల్డ్ లేబర్ ఉన్నారా?, సింథటిక్ దుస్తులు ధరించకుండా కాటన్ దుస్తులనే వాడుతున్నారా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అగ్నిమాపక పరికరాల లభ్యత, ఎగ్జిట్ పాయింట్లు, పొగత్రాగడం పై నిషేధం వంటి భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరిక: జిల్లాలో ఎక్కడైనా అనధికారికంగా బాణాసంచా తయారు చేసినా లేదా నిల్వ ఉంచినా తక్షణమే చట్టపర మైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడమైనది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ఈ తనిఖీలు నిర్వహించడమైనది. ప్రజలు కూడా తమ పరిసరాల్లో ఎవరైనా అక్రమంగా పేలుడు పదార్థాలను నిల్వ ఉంచితే పోలీసులకు సమాచారం అందించాలని కోరడమైనది.



# అంగన్వాడీల డిమాండ్లను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది.



2 సార్లు వేతనాలు పెంచింది తెలుగుదేశం ప్రభుత్వమే. అంగన్వాడీలకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన. జగన్ రెడ్డి చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రం కోలుకుంటోంది. త్వరలోనే సమస్యలని పరిష్కారమవుతాయి ఎమ్మెల్యే దగ్గుపాటి.

అనంతపురం, పెన్ సత్తా, మార్చి 01: అంగన్వాడీలు గత కొన్ని రోజులుగా ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని, వారి న్యాయ మైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలిస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు తమ సమస్యల పై దీక్షలు చేస్తున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. ప్రభుత్వం ఈ 20 నెలల కాలంలో అంగన్వాడీలకు చేసిన మంచిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్‌గా పదోన్నతి కల్పించి, పూర్తి స్థాయి వేతనాలు అందించనుందన్నారు. అలాగే కొత్తగా 5,000 మంది అంగన్వాడీ సహాయకులను నియమించనుందన్నారు. ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురు చూసిన గ్రాట్యుటీ కోసం బడ్జెట్‌లోనే రూ. 20 కోట్లు కేటాయించి, అధికారం లోకి వచ్చిన 9 నెలల్లోనే అంగన్వాడీలకు అండగా నిలిచిందన్నారు. అంగన్వాడీ కేంద్రాల హాజరు 70 శాతం నుంచి 96 శాతానికి పెరగడం కూటమి పాలనకు వచ్చిన ప్రత్యక్ష ఫలితమే అన్నారు. 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కో ఆర్డినేటర్లకు రూ. 75 కోట్ల వ్యయంతో 5జీ స్మార్ట్‌ఫోన్లు అందించిందన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు అందేలా చర్యలు తీసుకుని, జీతాల ఆలస్యానికి శాశ్వతంగా కూటమి ప్రభుత్వం చెక్ పెట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. ప్రభుత్వం ఇంత మంచి చేసినప్పుడు మీ వేతనాలు, ఇతర వాటి విషయంలో ఎందుకు ఆలోచించదన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి మీ డిమాండ్లు తీసుకెళ్లామని మీకు న్యాయం చేసేందుకు ఆయన కూడా సానుకూలంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దివాళ తీసి వెళ్లిందన్నారు. వారు చేసిన అప్పులకు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు ఇంకా అప్పులు తెచ్చి వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి నేడు రాష్ట్రంలో ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్ని అధిగమించి.. ఉద్యోగులకు క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తోందన్నారు. ఇలాంటి సమయంలో అంగన్వాడీల డిమాండ్లను కూడా ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంటోందని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు.

# మన ఇంటి పిచ్చుకలను మనమే కాపాడుకుందాం.

- మానవాళికి మేలు చేసేవి ఇంటి పిచ్చుకలు.
- సమస్త జీవరాశిని కాపాడుకుందాం.
- రైతు నేస్తాల పరిరక్షణ మన బాధ్యత.
- రాఘవేంద్ర రావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్.

**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 01:** మన ఇంటి పిచ్చుకలను మనమే కాపాడుకుందాం అని విశాఖపట్నం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాఘవేంద్ర రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం రైల్వేస్టేషన్ కు చేరువ లోని 150 ఏళ్ల మర్రి మాను దగ్గర 20 రోజులు పిచ్చుకల పరి రక్షణ ప్రచారం, పిచ్చుకల గూళ్ళు, నీటి పాత్రలు, ధాన్యం కంకులు కుచ్చులు పంపిణీ, చిత్రాల ప్రదర్శన అనంతరం ఆయన మాట్లాడారు. వరి పంటను ఆశించే నల్లి నివారణకు కృషి చేసే పిచ్చుకలను పదివేల సంవత్సరాల కిందట వ్యవసాయం చేసే వారంతా తమ ఇంటికి ఆహ్వానించారని పేర్కొన్నారు. అవి అంతరించి పోకుండా అనాదిగా జెవి రత్నం నేతృత్వం లోని గ్రీన్ క్లైమేట్ టీం కృషి చేస్తోందన్నారు. పిచ్చుకలు పరి రక్షణకుగాను వరి కోతలు అయిన తర్వాత వరి కంకుల కుచ్చులు ఇంటికి తీసుకువచ్చి సురుకు వేలాడదీసేవారు మన పూర్వీకులు అని వివరించారు.

గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రిందట వచ్చిన రసాయన క్రిమిసంహారకాలు వరి పాలవెన్నుల పై వచ్చిన నల్లి నివారణకు పిచికారి చేయడంతో నల్లి నివారింపబడలేదు కానీ పిచ్చుకలు అంతరించిపోవడం ప్రారంభ మైందన్నారు. గడ్డి తొలగించి ల్యాండ్ స్కేపులు చేయడంతో వాటికి లభించే కొద్దిపాటి గడ్డి గింజలు కూడా అంతరించిపోయాయి. ఆ తర్వాత కాలంలో ఇళ్ళన్నీ కాంక్రీట్ భవనాలుగా మారడంతో అవి గూడు పెట్టుకోవడానికి చోటు లేకుండా పోయిందని వివరించారు. సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ మానవాళికి మేలు చేసేవి ఇంటి పిచ్చుకలు, కాబట్టి వీటిని కాపాడుకోవడం మానవాళి బాధ్యత అన్నారు. మనకు మేలు చేసే పిచ్చుకల కోసం ఆహారం, నీరు, గూడు అందుబాటులో ఉంచవలసిన బాధ్యత మనదే అని వివరించారు. వనమాలి, సిటిజి గ్రూపుల ప్రతినిధి సరిత మాట్లాడుతూ సమస్త జీవరాశిని కాపాడుకుందామన్నారు. లేకుంటే మానవాళికి ముప్పు తప్పదని హెచ్చరించారు. మానవాళి కి ప్రతి జీవితో సంబంధం కలిగి ఉంది. కాబట్టి మన జీవవైవిధ్యాన్ని మనమే కాపాడుకోవాలి న్నారు. పదేళ్ల క్రిందట వచ్చిన రసాయన గడ్డి నివారణ మందు, అంతకు ముందు వచ్చిన రసాయన క్రిమిసంహారకాలు, రసాయన ఎరువులు కూడా రైతులకు ఉపకరించే పిచ్చుకలు, కప్పలు, తొండలు, పాములు గుడ్లగూబలో తదితరమైన జీవులను అంతరింప చేస్తున్నారన్నారు.


ఈ కార్యక్రమంలో మేంగొ మేన్ అప్పాజీ, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ సంస్థ అనకాపల్లి హెచ్ ఆర్ డి ఐ కృష్ణ కుమారి, గ్రీన్ వాలంటీర్ జె రాజేశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ నేతృత్వంలో,సిఫా ట్రస్ట్, వనమాలి సిటిజి గ్రూపుల ప్రతినిధులు కొబ్బరి తోట, భూపేష్ నగర వాసులకు ఉచితంగా పిచ్చుకల గూళ్ళు, నీటి పాత్రలు, ధాన్యం కంకులు కుచ్చులు పంపిణీ చేశారు.








# మార్చి 3 న స్వామివారి దర్శనాలు నిలిపివేత.





**చంద్రగ్రహణం దృష్ట్యా మార్చి 3 న ఆలయ ద్వారాల మూసివేత.**

**సింహాచలంలో ఘనంగా డోలోత్సవం**

**సింహాచలం, పెన్ సత్తా, మార్చి01:** మార్చి 3 వ తేదీన (మంగళవారం) ఫాల్గుణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని, వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానంలో నిర్వహించబోయే డోలోత్సవం, వసంతోత్సవం, గ్రామ తిరువీధి ఉత్సవాల ఏర్పాట్ల పై ఆదివారం ఆలయ కళ్యాణ మండపంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయ ఇంజనీరింగ్ అధికారులు, సహాయ కార్యనిర్వహణ అధికారులు, ప్రధాన అర్చకులు ఈ సమావేశంలో పాల్గొని ఉత్సవాల నిర్వహణ పై చర్చించారు. మార్చి 3 న తెల్లవారుజామున 4.00 గంటలకు స్వామివారు మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు వేంచేస్తారు. పుష్కరిణి సత్రం వద్ద ఉన్న ఉద్యానవన మండపంలో డోలోత్సవం, వసంతోత్సవ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతాయి. ఉదయం 6.00 గంటల నుండి స్వామివారి శోభాయాత్ర గ్రామ తిరువీధి అత్యంత వైభవంగా నిర్వహించ బడుతుంది. ఆ రోజున గ్రస్తోదయ చంద్ర గ్రహణం సంభవించనున్న నేపథ్యంలో, ఉత్సవం ముగిసిన వెంటనే స్వామివారిని త్వరితగతిన కొండ పైకి చేర్చుతారు. ఉదయం 8.00 గంటలకే ఆలయ కవాట బంధనం (ద్వారాల మూసివేత) జరుగుతుంది. గ్రహణం కారణంగా మార్చి 3 న స్వామివారి దర్శనాలు నిలిపివేయబడ్డాయి. సుప్రభాత సేవతో సహా అన్ని రకాల ఆర్జిత సేవలు రద్దు చేయబడ్డాయి. భక్తులు ఈ విషయాన్ని గమనించవలసిందిగా ఆలయ అధికారులు కోరారు. ఈ పవిత్ర ఉత్సవాల్లో భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి దివ్య దర్శనం పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి విజ్ఞప్తి చేశారు.

# సిసి రోడ్లకు 29 లక్షలు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం

- ఘనంగా ప్రారంభించిన కూటమి నాయకులు.
- హాజరైన క్లస్టర్ ఇన్చార్జ్ బంటు రవి.

**మారేడుపూడి, పెన్ సత్తా, మార్చ్ 01 :** అనకాపల్లి మండలం, మారేడుపూడి పంచాయతీలో సర్పంచ్ సాలాపు కనకరాజు అధ్యక్షతన, జనసేన క్లస్టర్ ఇంచార్జ్ బంటు రవి చేతుల మీదుగా సిసి రోడ్ల నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు. ముందుగా సర్పంచ్ సాలాపు కనకరాజు భూమి పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ 2.0 లో భాగంగా మారేడుపూడి గ్రామానికి నిధులు కేటాయించి సిసి రోడ్ల నిర్మాణానికి సహకరించినటువంటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కి, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పీలాగోవింద సత్యనారాయణ కి, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమర శెట్టి రామ్కి కి ధన్యవాదాలు తెలియజేశారు. మండలంలో ఎక్కడా లేనివిధంగా అత్యధికంగా మారేడు పూడి గ్రామానికి సిసి రోడ్ల నిర్మాణానికి 29 లక్షల రూపాయలను కేటాయించారని తెలియజేశారు. ఇదే విధంగా రానున్న రోజుల్లో కూడా గ్రామానికి అన్ని విధాల సహకరించాలని కోరారు. అనంతరం జనసేన పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ బంటు రవి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారని, అందులో భాగంగా మారేడు పూడి గ్రామానికి సిసి రోడ్ల అభివృద్ధికి మండలం లోనే అత్యధికంగా 29 లక్షల రూపాయలను మంజూరు చేశారని తెలియజేశారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీల అభివృద్ధికి సహకరించకపోగా పంచాయతీల్లో ఉన్న సొమ్మును కాజేసారని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో పంచాయతీలకు ఏనాడు పైసా ఇచ్చిన పాపాన పోలేదని ఆయన ఎద్దేవా చేశారు. కూటమి నాయకులందరూ కలిసికట్టుగా పనిచేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని తెలియజేశారు.





ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామి దర్శించుకున్న దొడ్డి



**మునగపాక, పెన్ సత్తా, మార్చి 01:** మండలం లోని మూలపేట పంచాయతీలో డిఎంఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్మించిన అభయాంజనేయ స్వామి వారి 17 వ వార్షికోత్సవ వేడుకలు కమిటీ ఆహ్వానం మేరకు స్వామివారి దర్శనం చేసుకున్న మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు. ఆదివారం శ్రీనివాసరావు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆవకాలవ చైర్మన్ ఆడారి ఆనంద సన్యాసినాయుడు( జేకే బ్రదర్స్), ఆడారి జనార్దన్ రావు (మండల తెలుగుదేశం పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు), ఆడారి కాశీ రావు, సర్పంచ్ మీసేటి గంగప్ప నాయుడు, కాంగ్రెసులేశ్వర అప్పారావు, ఆడారి శంకర్రావు, బీశెట్టి మధు, మొల్లేటి పరమేశ్వర రావు, తనిశెట్టి శివ, పెంటకోట మహేశ్వర రావు, కమిటీ నాయకులు, కూటమ నాయకులు పాల్గొన్నారు.

# మార్చి 6 న ధర్నాను జయప్రదం





**అచ్చుతాపురం, పెన్ సత్తా, మార్చి 01:** తక్షణమే బిల్డింగ్ వర్కర్స్ హెల్పర్ బోర్డు పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలి అనే డిమాండ్లతో మార్చి 6 వ తేదీన చలో కలెక్టర్ ఆఫీస్ కార్యక్రమంలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయండి. ఆదివారం మండలంలో జరిగిన భవనిర్మాణ కార్మికుల సమావేశాలలో సిఐటియు నాయకులు పాల్గొని పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కూండ్రపు సోము నాయుడు మాట్లాడుతూ నిన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు ప్రధానంగా మూడే 1 సహజ మరణం, మట్టి ఖర్చులు. 2.డెలివరీ, 3.పెళ్లి కానుకలే ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కీలక మైన అంటే మూడు డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించలేదు. 1. 2020 సెప్టెంబర్ ముందు నాటికి రాష్ట్ర ప్రభుత్వం షూరిటీ చేసిన క్లైములు చెల్లించాలి. 2. 2020 సెప్టెంబర్ 7 నుండి ఇప్పటి వరకు అర్హులైన కార్మికులకు కూడా సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి, 3.ప్రమాద బీమా తప్పనిసరిగా అమలు చేయాలి. సంక్షేమ బోర్డు ద్వారా గతంలో అమలు చేసిన అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలి, ప్రమాదం మరణానికి ఇచ్చే ఆర్థిక సహాయం ఐదు లక్షల నుండి 10 లక్షల వరకు పెంచాలి సిఐటియు డిమాండ్ చేస్తుందని, లేని యెడల కార్మికుల ఐక్యం చేసి పోరాటాలు ఉదృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అప్పలనాయుడు, కె రాజు, రమేష్, లక్ష్మణ్, రాజు, పైడ్రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన, దుబ్బాక ఇంచార్జ్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి




**చేగుంట: పెన్ సత్తా, మార్చ్ 01** చేగుంట మండల పరిదిలోని కన్యారం గ్రామం లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ సర్పంచ్ కర్రే పుష్ప శంకరయ్యా హాజరయ్యారు. అనంతరం వారు ఇందిరమ్మ ఇల్లుకు రిబ్బన్ కట్ చేసి ఇళ్ల గృహ ప్రవేశంను ప్రారంభించారు. అనంతరం వీరిని లబ్ధిదారులు శాలువాతో సన్మానం చేశారు,ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, మార్కెట్ కమిటీ అన్నం ఆంజనేయులు, స్టాలిన్ నర్సిములు, పక్కిర్ నాయక్, చేగుంట సర్పంచ్ సండ్రుగు స్రవంతి సతీష్,వడియారం సర్పంచ్ సాయికుమార్ గౌడ్,చిన్న శివనూర్ ఉపసర్పంచ్ ప్రశాంత్, ఇబ్రహీంపూర్ ఉపసర్పంచ్ చౌదరి శ్రీనివాస్,యూత్ అధ్యక్షులు మోహన్ నాయక్, మద్దూరి రాజు, అయిత పరంజ్యోతి, కన్యారం సతీష్, సాబ్ ర్, తదితరులు పాల్గొన్నారు,

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి.

- జిల్లా కలెక్టర్ అంకిత్.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, మార్చ్ 01** మార్చి 02వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.

ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిన్నమండవలో జాతీయ సైన్స్ ప్రదర్శన ఘనంగా నిర్వహణ.



**చింతకాని పెన్ సత్తా, మార్చ్ 01** చిన్న మండవ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిన్న మండవలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత ప్రఖ్యాత శాస్త్రవేత్త జ. ఎ. ఝుఝుఅ ఆవిష్కరించిన "రామన్ ఎఫెక్ట్"కు గౌరవార్థంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న నిర్వహించే ఈ దినోత్సవాన్ని ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు పసుపులేటి పుల్లారావు గారి అధ్యక్షతన వైభవంగా జరిపారు.

కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనాస్ఫూర్తి, సృజనాత్మకత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. శాస్త్రం మన జీవన విధానాన్ని మార్చే శక్తి కలిగిన సాధనమని, విద్యార్థులు ప్రశ్నించడం, పరిశీలించడం, ఆలోచించడం వంటి లక్షణాలను అలవాటు చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు మార్గదర్శకత్వంలో విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, పునర్వినియోగ శక్తి వనరులు, నీటి సంరక్షణ, స్మార్ట్ వ్యవసాయం వంటి అంశాలపై రూపొందించిన మోడల్స్ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ ప్రాజెక్టుల పనితీరును ప్రత్యక్షంగా వివరిస్తూ అతిథులను ఆకర్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపసర్పంచ్ తంగిరాల మాధవి గారు, మండల విద్యాశాఖ అధికారి సలాది రామారావు హాజరయ్యారు. విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ, మండల విద్యాశాఖ అధికారి సలాది రామారావు మాట్లాడుతూ సి.వి. రామన్ ఆవిష్కరణలు దేశానికి అపార గౌరవం తెచ్చాయని పేర్కొన్నారు. శ్రమ, పట్టుదల, జిజ్ఞాస ఉంటే విద్యార్థులు కూడా భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చని ప్రేరణనిచ్చారు.

సైన్స్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసలు అందజేయబడినాయి.జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు చిన్న మండవలో విజ్ఞానోత్సవంగా మారి విద్యార్థుల్లో శాస్త్రీయ చైతన్యాన్ని పెంపొందించాయి.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, అంజాద్ ఖాన్, సునీల రాణి, ఉష తో పాటు గ్రామ పెద్దలు గుండ్ల బేబీ రాణి, తంగిరాల నరసింహారావు, రఘురాం, గుండ్ల రాంబాబు ఆయుష్మన్ భారత్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## గర్వించదగ్గ సివిల్ సర్వెంట్

ఒక సాధారణమైన టైలర్ కుటుంబంలో జన్మించి సామాజికంగా, ఆర్థికంగా ఎన్నో ఒడిదొడుగులను ఎదుర్కొని భారతదేశం గర్వించదగిన స్థానంలో నిలిచారు పరికిపండ్ల నరహరి, ఐఏఎస్.తను పదవ తరగతి చదువుతున్న రోజుల్లోనే ఐఏఎస్ అధికారి కావాలని ధృఢ సంకల్పంతో... ఆ దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో అడుగడుగున ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తన తండ్రితో మొదటి సారి ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ కోసం హైదరాబాద్ వెళ్ళినప్పుడు భోజనం చేయడానికి కూడా డబ్బులు లేని పరిస్థితిని ఈ రోజుకు కూడా పలు సందర్భాల్లో ఆయన గుర్తు చేసు కుంటారు. ఎన్ని కష్టాలు వచ్చిన తన గమ్యం ముందర అవి చిన్నగానే కనిపించేవనీ చెప్తారు. ఇంటి నుండి ప్రతి నెల డబ్బులు పంపించలేని పరిస్థితి ఉండడంతో నెలవారీ ఖర్చులకోసం ట్యూషన్స్ చెప్తూ ఇంజనీరింగ్ లో యూనివర్సిటీ టాపర్ గా నిలిచిన గొప్పతనం ఆయనది. ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసేస్‌లో ఉత్తీర్ణత సాధించి ఒక సంవత్సరం పాటు సైంటిస్ట్ గా సేవలు అందించారు. ఆర్థిక ఇబ్బందుల వలన ఒక సంవత్సరం పాటు ఎఖా ఉద్యోగం చేసి తరువాత ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రభుత్వ స్టడీ సర్కిల్లో పూర్తి స్థాయిలో సివిల్స్ కోసం ప్రిపరేషన్ మొదలు పెట్టారు. 2001 లో సివిల్స్ లో ఆల్ ఇండియా 84వ ర్యాంక్ సాధించి మధ్య ప్రదేశ్ క్యాడర్ ఎయా అధికారిగా నియమింపబడ్డారు. ఎన్నో ఆశలు, ఆశయాలతో ఆ స్థానంలో నిలిచిన వారు ప్రతి పోస్టింగ్ లో తన మార్క్ పనితనంతో ప్రజల మరియు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మన్ననలు పొందుతున్నారు. మునిసిపల్ కమిషనర్ మొదలుకొని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా మధ్య ప్రదేశ్ లోని ఎన్నో జటిలమైన సమ్యసలకు సమాధానంగా నిలిచారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించిన అవార్డులే వారి పని తీరుకు నిదర్శనం.నరహరి హమారా లాడ్లి లక్ష్మి యోజన(బంగారు తల్లి) పథకం రూపొందించారు. భేటీ బచావో – భేటీ పడావో పథకానికి పునాదులు వేసారు.సోషల్ మీడియా ద్వారా గ్రివియన్స్ మొదలుపెట్టిన మొదటి ఐఏఎస్ అధికారిగా నిలిచారు. హరియాలి (హరిత హారం) అనే కార్యక్రమంతో ఒకే రోజు లక్ష మొక్కలని నాటించారు. ఇండోర్ సిటిని స్వచ్ సర్వెక్షన్ లో క్లీనేస్ట్ సిటి ఆఫ్ ఇండియా గా నిలిపారు. ఇండోర్ జిల్లాని బహిరంగ మల మూత్ర విసర్జన రహిత జిల్లాగా నిలిపారు.

గ్వాలియర్ జిల్లాలోని 95 శాతం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మరియు జనసంద్రంగా ఉండే ప్రదేశాల్లో దివ్యాంగులకోసం కచ్చితంగా రాంప్ లు కట్టించారు. స్కిల్ డెవలప్మెంట్ స్కీమ్స్ ద్వారా ఒక్క సంవత్సరంలో 36 లక్షల మంది యువకులకు బ్యాంకుల ద్వారా ఋణాలు ఇప్పించే కార్యక్రమం చేపట్టారు.నరహరి ఎన్నో రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్నారు. వికలాంగులకోసం వారు చేసిన సేవలను మరియు స్వచ్ సర్వెక్షన్ – ఇండోర్ కు గానూ కేంద్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్రపతి అవార్డు అందించారు.ప్రతి సంవత్సరం భారతదేశ ఉత్తమ ఐఏఎస్ అధికారులలో పలు ఏజెన్సీస్ మరియు ప్రభుత్వం ఇచ్చే జాబితాలో టాప్ 5 ఐఏఎస్ అధికారిగా నిలిచారు.మధ్య ప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వర్తిస్తు అన్ని విజయాలు సాధించినప్పటికి తను పుట్టిన గడ్డకి సేవా చేయాలని ఆలోచనతో తన మిత్ర బృందం ద్వారా ఆలయ ఫౌండేషన్ ని స్థాపించి విద్యా, వైద్య మరియు ఉపాధి రంగాలలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.మారుమూల గ్రామాల్లో, తండాల్లో మెడికల్ క్యాంప్స్ నిర్వహిస్తున్నారు. తలసెమ్మియా పిల్లల కోసం రక్తదాన శిబిరాలు వందలాది కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.వెయ్యి మందికి పైగా వికలాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలను అందించారు, నిరంతరాయంగా అందిస్తున్నారు. ఎన్నో పాఠశాలల్లో, కళాశాలల్లో, యూనివర్సిటీలలో స్వయంగా వ్యక్తిత్వ వికాసా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోటివేషనల్ స్పీకర్స్ ద్వారా వేల సంఖ్యలో కార్యక్రమాలు ఫౌండేషన్ ద్వారా చేపట్టారు.కార్పొరేట్ కంపెనీలలో యువతీ, యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.బసంతనగర్ లో శంకర వారి సహకారంతో ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి ఆసుపత్రి నిర్మించి వేల సంఖ్యలో నిరంతరాయంగా ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా అన్ని అవకాశాలు అందరికీ దక్కాలి, నిర్ణయాత్మకమైన స్థానాల్లో అన్ని వర్గాల ప్రజలు ఉంటేనే సామాజిక న్యాయం జరుగుతుందని, నాయకులుగా ఎదిగే అవకాశం అందరికి రావాలని, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే ఆలోచన ఉన్న యువతకి లీడర్షిప్ ట్రైనింగ్ క్లాసెస్ జన అధికార సమితి ద్వారా నిర్వహిస్తున్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని అవకాశాలు అన్ని వర్గాలు అందిపుచ్చుకొని విధంగా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారు.

# గ్యాస్ సమస్యను లైట్‌గా తీసుకుంటున్నారా..?



గ్యాస్ వల్ల తలనొప్పి వస్తుందా? ఎన్నిసార్లు మీరు తీవ్రమైన తలనొప్పిని అనుభవించి, దానిని కేవలం ఒత్తిడి అని తోసిపుచ్చారు? ఆఫీసు ఒత్తిళ్లు, క్రమం లేని దినచర్యలు, వేళపాల లేని భోజనం వంటి కారణాలు తలనొప్పిని సాధారణం చేస్తాయి. కానీ, ప్రతి తలనొప్పి ఒత్తిడి వల్ల కాదు. కొన్నిసార్లు, మూల కారణం కడుపులో ఉంటుంది. దీనిని సాధారణంగా గ్యాస్ తలనొప్పి లేదా గ్యాస్ట్రిక్ తలనొప్పి అని పిలుస్తారు. గ్యాస్ మీ తలకు ఎప్పుడు చేరుతుందో తెలుసా..? గ్యాస్ట్రిక్ తలనొప్పి అనేది సాధారణ టెన్షన్ లేదా సైనస్ తలనొప్పి కాదు. జీర్ణవ్యవస్థలో అజీర్ణం, ఆమ్లత్వం లేదా గ్యాస్ వంటి సమస్యలు ఉన్నప్పుడు ఇది సంభవిస్తుంది. కడుపు, మెదడు దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. కడుపులో అసమతుల్యత ఉన్నప్పుడు, శరీరం ప్రతిస్పందిస్తుంది. చాలా మందిలో నొప్పి తలకు వ్యాపిస్తుంది. కారంగా ఉండే ఆహారాలు, సక్రమంగా భోజనం చేయకపోవడం, అధిక టీ, కాఫీ వినియోగం, నిరంతర ఒత్తిడి ఇవన్నీ ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. ఒక నివేదిక ప్రకారం, సాధారణ గ్యాస్ట్రిక్ తలనొప్పి, గ్యాస్ట్రిక్ మైగ్రేన్ మధ్య వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. గ్యాస్ట్రిక్ తలనొప్పి తేలికపాటిది లేదా నిరంతరంగా ఉంటుంది. అయితే గ్యాస్ట్రిక్ మైగ్రేన్ మరింత తీవ్రమైన, కొట్టుకునే నొప్పిగా ఉంటుంది. ఇది కాంతి, శబ్ద సున్నితత్వం, వికారం లేదా వాంతులు కూడా కలిగి ఉంటుంది. రెండు సందర్భాల్లో, అంతర్లీన కారణం జీర్ణ సమస్యలు. ఈ సమస్య అప్పుడప్పుడు సంభవిస్తే, అది ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కానీ, ఇది తరచుగా పునరావృతమైతే, దానిని విస్మరించవద్దు. నిరంతర గ్యాస్ట్రిక్ తలనొప్పి దీర్ఘకాలిక గ్యాస్ట్రిటిస్, పెప్టిక్ అల్సర్లు, పిత్తాశయ వ్యాధి, ప్రకోప ప్రేగు సిండ్రోమ్ లేదా గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధి వంటి తీవ్రమైన పరిస్థితులకు సంకేతం కావచ్చు. వారానికి రెండుసార్లు కంటే ఎక్కువసార్లు తలనొప్పి వస్తే, ఎటువంటి కారణం లేకుండా బరువు తగ్గుతుంటే, వాంతులు అవుతున్నా లేదా తీవ్రమైన కడుపు నొప్పిని అనుభవిస్తున్నా, లేదా ఇంటి నివారణలు ఉపశమనం కలిగించకపోతే, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్‌ను సంప్రదించండి. అవసరమైతే, ఎండోస్కోపీ వంటి పరీక్షలు జీర్ణవ్యవస్థ పరిస్థితిని స్పష్టం చేస్తాయి. చికిత్స అంటే నొప్పి నివారణ మందులు మాత్రమే కాదు, జీర్ణక్రియను మెరుగుపరచడం. సమయానికి తినడం, తేలికైన, సమతుల్య ఆహారం తీసుకోవడం, తగినంత నీరు త్రాగడం, నిరాశను నియంత్రించడం వల్ల గణనీయమైన ఉపశమనం లభిస్తుంది. మీరు దానిని తలలో వాయువుగా తోసిపుచ్చలేరు, ముఖ్యంగా ఇది పునరావృతమయ్యే సమస్య అయితే. మీరు దానిని వెంటనే పరిష్కరించకపోతే, అది దీర్ఘకాలంలో తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది.

# వాటర్ బాటిల్ ఇలా చేస్తే తళతళలాడాల్సిందే!



చాలా మంది ఇంట్లో కూడా బాటిల్ వాటర్ తాగుతారు. కానీ చాలా మంది దాని శుభ్రత గురించి పట్టించుకోరు. బాటిల్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోతే బ్యాక్టీరియా పేరుకుపోతుంది. క్రమంగా అది దుర్వాసన రావడం ప్రారంభిస్తుంది. నేటి ఉరుకుల పరుగుల జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ఎక్కడికి వెళ్ళినా తమతో పాటు ఓ వాటర్ బాటిల్ తీసుకెళ్తుంటారు. చాలా మంది ఇంట్లో కూడా బాటిల్ వాటర్ తాగుతారు. కానీ చాలా మంది దాని శుభ్రత గురించి పట్టించుకోరు. బాటిల్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోతే బ్యాక్టీరియా పేరుకుపోతుంది. క్రమంగా అది దుర్వాసన రావడం ప్రారంభిస్తుంది. అలాంటి బాటిల్‌లో నీళ్లు తాగడం వల్ల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందువల్ల వాటర్ బాటిల్‌ను సరిగ్గా శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యం. ఉప్పు, నిమ్మరసం మిశ్రమం వాటర్ బాటిల్ మురికిని తొలగించడంలో మాత్రమే కాకుండా బాటిల్ దుర్వాసనను తొలగించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటుంది. దీని కోసం ముందుగా కొంచెం వాటర్‌లో ఉప్పు, నిమ్మరసం కలపాలి. ఆ తరువాత కొంచెం బాటిల్‌లోపోసి బ్రష్‌తో బాటిల్‌ను బాగా స్క్రబ్ చేయాలి. కొంత సమయం తర్వాత శుభ్రం చేసుకుంటే సరి. ఇది మురికి, వాసన రెండింటినీ తొలగిస్తుంది. వాటర్ బాటిల్‌లో మరకలను తొలగించడానికి ముందుగా ఒక టేబుల్ స్పూన్ వెనిగర్, టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా, కొద్దిగా నీళ్లు పోసి బాటిల్ కు వేసి మూత పెట్టాలి. ఆ తర్వాత బాటిల్ ను బాగా కదిలించాలి. దాదాపు 10 నుండి 15 నిమిషాల తర్వాత వాటర్ బాటిల్ ను కడిగి శుభ్రం చేసుకోవచ్చు. ఈ పద్ధతి వాటర్ బాటిల్ నుంచి మురికి, దుర్వాసన రెండింటినీ వదిలిస్తుంది. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో బేకింగ్ సోడా, చిటికెడు ఉప్పు కలపాలి. ఆ నీటితో బాటిల్ నింపాలి. తరువాత బ్రష్ లేదా స్క్రబ్బర్ తో లోపలి భాగాన్ని స్క్రబ్ చేసి శుభ్రమైన నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ పద్ధతి బాటిల్ మురికి, దుర్వాసనను పూర్తిగా తొలగిస్తుంది. టీ బ్యాగులు బాటిల్దుర్వాసనను తొలగించడంలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఇందుకోసం బాటిల్‌ను నీటితో నింపి దానిలో ఒక టీ బ్యాగ్‌ను ఉంచి, రాత్రంతా అలాగే ఉంచాలి. మరుసటి రోజు ఉదయం బాటిల్‌ను బాగా శుభ్రం చేస్తే వాసన పోతుంది. ఇలా వారానికి ఒకసారి బాటిల్‌ను శుభ్రం చేస్తూ ఉండాలి.

# మహిళలు పిల్లల్ని కనే యంత్రాలేనా..?



పెళ్లై కనీసం ఆర్నెల్లు కూడా కాలేదు. పని ఒత్తిడో, మరేదైనా కారణమో కానీ.. ఈ మధ్య తరచుగా తనకు తలనొప్పి వస్తోందని చెప్పిన రిత్వికకు వాళ్లింట్లో వాళ్లు చెప్పిన జాగ్రత్తలు విని ఒకింత ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే.. వారు చెప్పిన దాంట్లో ఈమె తలనొప్పికి సంబంధించిన సమస్యకంటే.. ఆమె భవిష్యత్తులో గర్భధారణకు, తల్లి అయ్యేందుకు అది ఇబ్బందిగా మారుతుందేమోనన్న విషయంపైనే ఎక్కువగా చర్చిస్తున్నారు. ఇలా అయితే భర్తతో సాన్నిహిత్యం వేళ సంతోషంగా ఉండలేవేమో.. పిల్లల్ని కనడం కష్టమవుతుందేమో! అలా జరగకూడదంటే.. జర జాగ్రత్తగా ఉండు అని సలహాలిస్తున్నారు. చాలామందికి ఇందులో తప్పేముంది? అనిపిస్తుండవచ్చు. కానీ ప్రత్యక్షంగా అనుభవించే వారికి మాత్రం ఒక విధమైన బాధ, ఆవేదన వెంటాడుతుంది. ఎందుకంటే.. ఇక్కడ సదరు మహిళ తలనొప్పి తగ్గాలన్న ఆలోచన, ఆరాటం కంటే.. ఆమె మాతృత్వానికి పనికొస్తుందా లేదా అనే విషయంపైనే ఫోకస్ చేస్తున్నారు. ఒక్క రిత్వికనే కాదు.. ఆధునిక కాలంలోనూ అనేకమంది మహిళలు ఎదుర్కొంటున్న సమస్య ఇది. ఈరోజుల్లో మహిళల పట్ల వివక్ష ఎక్కడిది? అంటుంటారు చాలామంది. అయితే ఇది వందశాతం నిజం మాత్రం కాదంటున్నారు స్త్రీ వాదులు. ఒకప్పటితో పోలిస్తే పలు విషయాల్లో వివక్ష తగ్గి ఉండవచ్చు. సమానత్వ భావన పెరిగి ఉండవచ్చు. కానీ బయటకు కనిపించని అనేక అంశాల్లో అసమానతలు, అణచివేతలు, మహిళలపట్ల వివక్ష ఏదో ఒక రూపంలో నేటికీ కొనసాగుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా ఆరోగ్యం విషయంలో వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదు. పైగా వారు చులకన చేయబడుతున్నారు. కుటుంబాల్లో, సమాజంలో నిర్లక్ష్యం చేయబడుతున్నారు. అందుకు చక్కటి ఉదాహరణ అనేక కుటుంబాల్లో మహిళల ఆరోగ్యాన్ని కేవలం తల్లితనం(మాతృత్వం) దృక్కోణంలోనే చూడటం అంటున్నారు ప్రముఖ స్త్రీ వాద రచయిత ప్రీతి సింగ్. మహిళల శరీరాలను తరచూ భవిష్యత్ పునరుత్పత్తి కోసం ఉపయోగపడే స్థలాలుగా మాత్రమే చూస్తున్నామని ఆమె విమర్శిస్తారు. వారి ఆరోగ్యాన్ని వారి సొంత బాగోగుల కోసం కాకుండా, ఇంకా పుట్టని బిడ్డ కోసం ముందుగా జాగ్రత్త చేసే విధంగా పరిగణిస్తామని చెబుతారు. ఈ విధమైన పురుషాధిక్య లేదా మాతృస్వామ్య భావజాలం నుంచి సమాజం, మహిళలు పూర్తిగా బయటపడాలని సూచిస్తారు. మైగ్రేన్, తొలనొప్పి, పీరియడ్ పెయిన్, కడుపు నొప్పి, కాళ్లూ చేతులు లాగడం, కడుపులో ఉబ్బరం.. ఇలా అనేక సమస్యలు సాధారణంగా మహిళలు ఎదుర్కొంటుంటారు. ఆయా సందర్భాల్లో అవి ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల ప్రజలు, సమాజం బాలికలను, మహిళలను, ముఖ్యంగా కొత్తగా పెళ్లయిన స్త్రీలను చూసే కోణంలో, పరామర్శించడంలో,, సానుభూతి చూపడంలో పురుషులతో పోలిస్తే చాలా తేడా ఉంటుంది. ఇక్కడ మహిళల్ని భవిష్యత్ మాతృత్వానికి, భర్తతో శృంగార జీవితానికి ముడిపెట్టి చూసేవారే ఎక్కువ. అంటే ఆ సమస్యలు ఎదుర్కొంటున్నప్పుడు సదరు మహిళ భర్తకు శృంగారంలో సరిగ్గా సహకరించదేమోనని, తద్వారా గర్భధారణ రాదేమోనని, పిల్లల్ని కనడంలో ఇబ్బందులు ఎదురవుతాయేమోనని.. ఇలా తల్లితనం కోణంలోనే అంచనా వేస్తుంటారు చాలామంది పెద్దలు. అదే పురుషుల విషయానికి వస్తే అలా చేయరు. పురుషులకు ఏదైనా అనారోగ్యం వచ్చినప్పుడు.. కుటుంబంలోని స్త్రీ, పురుషులందరూ అతని ఆరోగ్య పునరుద్ధరణపై ఎక్కువ ఫోకస్ చేస్తారు. మహిళల మాదరి వారి అనారోగ్య సమస్యను సంతానం, మాతృత్వం, శృంగారంతో ముడిపెట్టి చూడరు. అదే స్త్రీల విషయంలో మాత్రం డిఫరెంట్. చిన్నప్పటి నుంచే బాలికలకు 'ఆరోగ్యంగా ఉండు, గర్భధారణకు మంచిది' అని నేర్పుతుంటారు. దీంతో ఆరోగ్యం వ్యక్తిగత హక్కుగా కాకుండా, తల్లితనం తయారీగా మారిపోతున్నదని, ఇది సామాజికంగా, సంస్థాగతంగా కూడా కనిపిస్తున్నదని స్త్రీ వాదులు అంటున్నారు. ఇది ఆధునిక కాలంలోనూ లింగ భేదాలను చిన్నప్పటి నుంచే ఎలా నేర్పబడుతున్నాయనేందుకు చక్కటి ఉదాహరణగా పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కుటుంబాల్లో, సమాజంలో పురుషాధిక్య లేదా పితృస్వామ్య భావజాలానికి స్వస్తి పలకాల్సిన అవసరాన్ని మహిళా లోకం గుర్తించాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. చదువుకోవడం, ప్రశ్నించడం, ఎడ్యుకేట్ అవడం, ఎడ్యుకేట్ చేయడం వంటివి ఈ విధమైన పరిస్థితులను మార్చడంలో కీ రోల్ పోషిస్తాయని, మహిళలు ఆ దిశగా ఆలోచించాలని, పురుషులు సైతం సహకరించాలని సూచిస్తున్నారు.

# అంతిమ యాత్రలో కుండపగులగొట్టడం వెనుక ఉన్న పరమార్థం

హిందూ ధర్మంలో అంతిమ సంస్కారాల సమయంలో నిర్వహించే ప్రతి క్రతువు వెనుక ఒక లోతైన తాత్విక చింతన దాగి ఉంది. ముఖ్యంగా చితి చుట్టూ మట్టి కుండతో ప్రదక్షిణ చేయడం కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు, అది మానవ జీవిత పరమార్థాన్ని చాటిచెప్పే ఒక గొప్ప సంకేతం. ఈ ప్రక్రియలో మట్టి కుండను మానవ భౌతిక దేహానికి ప్రతీకగా భావిస్తే, అందులోని నీటిని ఆ దేహంలో నివసించే ఆత్మకు నిదర్శనంగా పండితులు అభివర్ణిస్తారు. పుట్టుకతో మొదలైన ఈ బంధం, మరణం తర్వాత ఎలా వీడిపోతుందో ఈ ఆచారం ద్వారా లోకానికి వెల్లడిస్తారు.ప్రదక్షిణ చేసే సమయంలో కుండకు ఉన్న చిల్లుల ద్వారా నీరు కారిపోవడం అనేది, కాలం గడిచేకొద్దీ శరీరం నుంచి ప్రాణశక్తి లేదా ఆత్మ క్రమంగా వేరుపడుతోందని సూచిస్తుంది. మనిషి తన జీవిత కాలమంతా ఈ దేహమే శాశ్వతం అనుకుంటాడు, కానీ ఆ నీటి చుక్కల వలె ఆయుష్షు క్షీణించిపోతుందనే సత్యాన్ని ఇది గుర్తుచేస్తుంది. దేహంతో ఆత్మకు ఉన్న అనుబంధం శాశ్వతం కాదని, అది కేవలం ఒక విడది మాత్రమేనని ఈ నీటి ధార మనకు నిశ్శబ్దంగా బోధిస్తుంది. లౌకిక ప్రపంచం నుంచి అలౌకిక ప్రయాణం వైపు అడుగులు వేయడానికి ఇది ఒక సంకేతం.కుండను పగలగొట్టే ఆ ఘట్టం మనిషికి ప్రాపంచిక బంధాల నుంచి లభించే సంపూర్ణ విముక్తిని సూచిస్తుంది. మట్టితో తయారైన కుండ ఎలాగైతే పగిలి తిరిగి మట్టిలో కలిసిపోతుందో, పంచభూతాల సాక్షిగా నిర్మితమైన ఈ మానవ శరీరం కూడా చివరకు పంచభూతాల్లోనే లీనం కావాలని దీని అర్థం. మోహం, మమకారం, మరియు అహంకారం వంటి బంధనాలన్నీ ఆ క్షణంతో తెగిపోతాయి. శరీరం అనే బంధీఖానా నుంచి ఆత్మ స్వేచ్ఛను పొంది, పరమాత్మ వైపు తన ప్రయాణాన్ని సాగిస్తుందని వేదాలు ఘోషిస్తున్నాయి. చివరగా, ఈ సంప్రదాయం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం ఆత్మకు శాంతిని చేకూర్చడమే కాక, జీవించి ఉన్నవారికి జీవితంపై ఒక స్పష్టమైన అవగాహన కల్పించడం. శరీరం నశ్వరమని, ఆత్మ మాత్రమే నిత్యమని గ్రహించినప్పుడు మనిషిలో వైరాగ్యం, వివేకం కలుగుతాయి. ఆత్మ తన అంతిమ విముక్తి మార్గంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా పయనించాలని కోరుకుంటూ చేసే ఈ విలక్షణమైన ఆచారం, హిందూ సంస్కృతిలోని గొప్పదనాన్ని చాటిచెబుతుంది.

పెన్ సత్తా
సోమవారం 2 మార్చి 2026

# సంజూ శాంసన్ సూపర్ ఇన్నింగ్స్... వరల్డ్ కప్ సెమీస్ కు దూసుకెళ్లిన భారత్

టీ20 వరల్డ్ కప్ సూపర్-8 పోరులో వెస్టిండీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలిచిన భారత్

196 పరుగుల భారీ లక్ష్యాన్ని 19.2 ఓవర్లలోనే ఛేదించిన టీమిండియా

50 బంతుల్లో 97 పరుగులతో అజేయంగా నిలిచి ఒంటిచేత్తో గెలిపించిన సంజు శాంసన్

మొదట బ్యాటింగ్ చేసి 195 పరుగులు సాధించిన వెస్టిండీస్

మార్చి 5న ముంబై వేదికగా ఇంగ్లండ్‌తో సెమీఫైనల్ ఆడనున్న భారత్




ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా సెమీఫైనల్‌లోకి అడుగుపెట్టింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈరోజు వెస్టిండీస్‌తో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 196 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, సంజు శాంసన్ అద్భుత పోరాటంతో మరో 4 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో భారత్ మార్చి 5న ముంబై వేదికగా ఇంగ్లండ్‌తో సెమీఫైనల్‌లో తలపడనుంది.టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు షై హోప్ (32), రోస్టన్ చేజ్ (40) శుభారంభం అందించగా, చివర్లో రోవ్‌మన్ పావెల్ (19 బంతుల్లో 34 నాటౌట్), జేసన్ హోల్డర్ (22 బంతుల్లో 37 నాటౌట్) భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు అజేయంగా 76 పరుగులు జోడించడంతో విండీస్ భారీ స్కోరు సాధించగలిగింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా 36 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి చెరో వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం 196 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ ఆరంభంలోనే తడబడింది. అభిషేక్ శర్మ (10), ఇషాన్ కిషన్ (10) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. అయితే వన్ డౌన్‌లో వచ్చిన సంజు శాంసన్ విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. వికెట్లు పడుతున్నా.. ఒకవైపు వికెట్ కాపాడుకుంటూనే, మరోవైపు బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సూర్యకుమార్ యాదవ్ (18), తిలక్ వర్మ (27), హార్దిక్ పాండ్యా (17)లతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ముఖ్యంగా సూర్యతో కలిసి 58 పరుగులు, తిలక్‌తో కలిసి 42 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు.చివరి వరకు క్రీజులో నిలిచిన శాంసన్ 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇన్నింగ్స్ 19.2వ ఓవర్‌లో మిడ్-ఆన్ మీదుగా శాంసన్ కొట్టిన భారీ షాట్‌తో భారత్ విజయ తీరాలకు చేరింది. గెలిచిన వెంటనే మైదానంలో మోకాళ్లపై కూలబడి, ఆకాశం వైపు చూస్తూ దేవుడికి కృతజ్ఞతలు తెలిపాడు. సెంచరీకి కేవలం 3 పరుగుల దూరంలో నిలిచినప్పటికీ, జట్టును సెమీస్‌కు చేర్చానన్న ఆనందం అతనిలో కనిపించింది. చివర్లో శివమ్ దూబె (8 నాటౌట్) శాంసన్‌కు సహకరించాడు. ఈ విజయంతో గ్రూప్-1 నుంచి భారత్ దర్జాగా సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది.




# టీ20 వరల్డ్ కప్ లో సఫారీల జైత్రయాత్ర... జింబాబ్వేపై 5 వికెట్ల తేడాతో విజయం

కీలక సమయంలో డివాల్డ్ బ్రెవిస్ మెరుపు ఇన్నింగ్స్

మ్యాచ్‌ను ముగించిన జార్జ్ లిండే, ట్రిస్టన్ స్టబ్స్


సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో తలపడనున్న సఫారీలు

టీ20 ప్రపంచకప్ 2026లో దక్షిణాఫ్రికా తన జైత్రయాత్రను కొనసాగించింది. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన సూపర్-8 పోరులో జింబాబ్వేపై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో టోర్నీలో ఇప్పటిదాకా ఏకైక అజేయ జట్టుగా నిలిచిన సఫారీలు, కోల్‌కతాలో జరగనున్న సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో తలపడనున్నారు.

154 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికాకు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. జింబాబ్వే స్టార్ ఆల్ రౌండర్, కెప్టెన్ సికందర్ రజా తన స్పిన్ మాయాజాలంతో క్వింటన్ డికాక్, కెప్టెన్ ఐడెన్ మార్క్రమ్‌లను స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చారు. ర్యాన్ రికెల్టన్ (31) మూడు సిక్సర్లతో విరుచుకుపడినా, బ్రాడ్ ఇవాన్స్ బౌలింగ్‌లో అవుట్ అవ్వడంతో సఫారీలు 43 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డారు.ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన డివాల్డ్ బ్రెవిస్ మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. కేవలం 18 బంతుల్లోనే 2 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 42 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. డేవిడ్ మిల్లర్ కూడా దూకుడుగా ఆడటంతో

దక్షిణాఫ్రికా కోలుకుంది. అయితే రజా, ముజరబానీలు ఈ ఇద్దరినీ అవుట్ చేయడంతో మ్యాచ్ మళ్లీ ఉత్కంఠగా మారింది. చివర్లో జార్జ్ లిండే (30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (21 నాటౌట్) బాధ్యతాయుతంగా ఆడి మరో 13 బంతులు మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఈ జోడీ స్ట్రైక్ రొటేట్ చేస్తూ దక్షిణాఫ్రికాకు విజయాన్ని అందించింది.

# రాజసం ఉట్టిపడేలా.. చీరకట్టులో రాశి ఖన్నా అందాలు..



టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అంటూ భాషతో సంబంధం లేకుండా వరుస భాషా చిత్రాలలో నటిస్తూ మరింత బిజీగా మారిపోయింది ప్రముఖ హీరోయిన్ రాశి ఖన్నా. 2013లో 'మద్రాస్ కేఫ్'అనే సినిమాతో హిందీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తెలుగులో 2014లో అక్కినేని కుటుంబం నటించిన 'మనం' అనే సినిమాలో కేమియో పాత్రలో కనిపించి బాగా ఆకట్టుకుంది. ఆ తర్వాత ఊహలు గుసగుసలాడే సినిమాతో హీరోయిన్ గా భారీ క్రేజీ సంపాదించుకొని జోరు, జిల్, బెంగాల్ టైగర్, సుప్రీం, జై లవకుశ, రాజా ది గ్రేట్, తొలిప్రేమ తదితర చిత్రాలలో నటించి హీరోయిన్గా భారీ పాపులారిటీ అందుకుంది.

సోషల్ మీడియాలో యాక్టివ్ గానే ఉన్న రాశి ఖన్నా బ్లాస్ట్ అయ్యే అందాలతో కుర్రాళ్లను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అప్పుడప్పుడు గ్లామర్ ఫోటోలతో కూడా సడన్ సర్ప్రైజ్ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా చీరకట్టులో మరింత అందంగా ఆకట్టుకుంటోంది. చీరకట్టులో కూడా అందాలను దాస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన ఈమె.. ఈ ఫోటోలు చూసి అభిమానులు లవ్ , ఫైర్ సింబల్ తో వైరల్ చేస్తున్నారు. ఈ అమ్మడు చీరకట్టులో ఫోటోలు తెగ వైరల్ గా మారుతున్నాయి. ఇంకొంతమంది రాజసం ఉట్టిపడేలా చీర కట్టులో ఆకట్టుకుంటోంది అంటూ కామెంట్లు చేస్తున్నారు.రాశి ఖన్నా చివరిగా 2025 లో వచ్చిన 'తెలుసు కదా' అనే సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా ఫ్లాప్ గా నిలిచింది. ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. పవన్ కళ్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో పాటుగా తమిళంలో ఒక సినిమా, హిందీలో మూడు చిత్రాలలో నటిస్తోంది. గతంలో చాలా బొద్దుగా ఉండే రాశి ఖన్నా ఈ మధ్యకాలంలో మరింత స్లిమ్ముగా మారి వరుస అవకాశాలను అందుకుంటోంది.

తన పాత్ర నచ్చితే మాత్రం రాశి ఖన్నా సెకండ్ హీరోయిన్గా కూడా నటించడానికి సిద్ధంగానే ఉంటుంది.గతంలో కూడా ఇలా ఎన్నో చిత్రాలలో నటించి మంచి విజయాలను అందుకుంది. ప్రస్తుతం ఈమె ఫోకస్ మొత్తం ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా పైనే పెట్టిందని చెప్పవచ్చు. ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రాశి ఖన్నాతో పాటు యంగ్ బ్యూటీ శ్రీలీల కూడా హీరోయిన్గా నటిస్తోంది. ముఖ్యంగా 13 ఏళ్ల తర్వాత మళ్లీ హరీష్ శంకర్ - పవన్ కళ్యాణ్ కాంబో రిపీట్ కాబోతుండడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఈ సినిమాతో రాశి ఖన్నా కచ్చితంగా బ్లాక్ బస్టర్ విజయం సొంతం చేసుకుంటుందని , ఈ సినిమాతో కచ్చితంగా టాలీవుడ్ లో కం బ్యాక్ అవుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ సినిమా రాశి ఖన్నాకు ఎలాంటి అ దృష్టాన్ని తెచ్చి పెడు తుందో చూడాలి.



## రుక్మిణికి స్టైల్‌తో ఎలా మెస్మరైజ్ చేయాలో తెలుసు

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com